# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 109 | విశాఖపట్నం | 20-1-2026 మంగళవారం | చీఫ్ ఎడిటర్ : శ్రీనివాస్ లెక్కల | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 109 | VISAKHAPATNAM | 20-1-2026 TUESDAY | CHIEF EDITOR: SRINIVAS LEKKALA | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



రిపోర్టర్లు కావలెను

పతాకం న్యూస్ PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు శ్రీకాకుళం, పాడేరు, గోదావరి జిల్లాలు తో పాటు ఆంధ్రప్రదేశ్‌లో గల రాయలసీమ, జిల్లాలో జిల్లా రిపోర్టర్స్ కావలెను.
అనుభవం ఉన్న వారికి మొదట ప్రాధాన్యత ఇవ్వబడును.
ప్రతి వార్త ఉన్నది ఉన్నట్టుగా రాసి చూపిద్దాం రండి...

ఆఫీస్ ఇంఛార్జ్ : ఎల్.కృష్ణ రావు

సంప్రదించవలసిన మా ఫోన్ నంబరు

9516171797, 9491286902





## రైతులను వీడని యూరియా కష్టాలు

లక్ష టన్నులకు చేరిన యూరియా కొరత!

## డైట్ నియమాలతో 'బరువు' తగ్గవచ్చు?







## పోలవరం ప్రాజెక్టు పురోగతిని పరిశీలించిన విదేశీ నిపుణుల బృందం

# స్విట్జర్లాండ్‌లో చంద్రబాబుకు ఘన స్వాగతం






**స్విట్జర్లాండ్:** ప్రపంచ ఆర్థిక వేదిక వార్షిక సదస్సులో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్విట్జర్లాండ్ చేరుకున్నారు. జనవరి 19, సోమవారం ఉదయం ఆయన జ్యూరిచ్ విమానాశ్రయానికి చేరుకోగా, యూరప్‌లోని ప్రవాస తెలుగువారు, ఎన్నారై టీడీపీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ కూడా ఉన్నారు. అనంతరం జ్యూరిచ్‌లో భారత రాయబార కార్యాలయం ఏర్పాటు చేసిన "మీట్ అండ్ గ్రీట్" కార్యక్రమంలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "జ్యూరిచ్‌లో నాకు ఆత్మీయ స్వాగతం పలికిన తెలుగు వారికి, ఎన్నారై టీడీపీ శ్రేణులకు ధన్యవాదాలు. యూరోప్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా జ్యూరిచ్ వచ్చి నా పట్ల చూపిన అభిమానానికి హృదయపూర్వకంగా కృతజ్ఞతలు. మన తెలుగు భాషకు, సంస్కృతికి ప్రతీకలైన మీ అందరినీ కలుసుకోవడం ఆనందంగా ఉంది," అని అన్నారు. జనవరి 19 నుంచి 22 వరకు నాలుగు రోజుల పాటు సాగే ఈ పర్యటనలో 'బ్రాండ్ ఆంధ్రప్రదేశ్' ను ప్రపంచానికి పరిచయం చేసి, రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు 36 సమావేశాల్లో పాల్గొననున్నారు. అంతకుముందు జ్యూరిచ్ విమానాశ్రయంలో సింగపూర్ దేశాధ్యక్షుడు షణ్ముగరత్నం, అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, వరల్డ్ బ్యాంక్ గ్రూప్ ప్రెసిడెంట్ అజయ్ బంగాతో చంద్రబాబు భేటీ అయ్యారు. అనంతరం చంద్రబాబు తన ప్రతినిధి బృందంతో కలిసి రోడ్డు మార్గంలో దావోస్‌కు బయల్దేరి వెళ్లారు. (తరువాయి 2వ పేజీలో)

### విజయవాడ-హైదరాబాద్

# హైవేపై భారీ రద్దీ



**విజయవాడ, హైదరాబాద్, పతాకం న్యూస్:** సంక్రాంతి సెలవులు ముగిశాయి. పండగ కోసం సొంతూళ్లకు వెళ్లిన ప్రజలు హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు. దీంతో సోమవారం విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారి(ఎన్‌హెచ్-65) వాహనాలతో రద్దీగా మారింది. ఎన్టీఆర్ జిల్లాలోని ఇబ్రహీంపట్నం వద్ద వాహన రద్దీ నెలకొనడంతో.. వాహనాలు క్యూ కట్టాయి. ఈ మేరకు పోలీసులు వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ నియంత్రణ చేపట్టారు. భారీ వాహనాలను హనుమాన్ జంక్షన్ వద్ద నూజివీడు, మైలవరం మార్గం ద్వారా హైదరాబాద్ వైపు మళ్లిస్తున్నారు. దీని వల్ల మెయిన్ హైవేలో రద్దీ కొంత మేర తగ్గే అవకాశం ఉంది. కాగా.. సంక్రాంతి పండుగ కోసం స్వగ్రామాలకు వెళ్లే సమయంలోనూ ఈ రహదారిపై భారీ రద్దీ నెలకొన్న విషయం తెలిసిందే. హైదరాబాద్ నుంచి ఏపీ వైపు వెళ్లే వాహనాలతో పంతంగి, చౌటుప్పల్ టోల్ గేట్ల వద్ద రద్దీ కారణంగా వాహనాలు ఆలస్యంగా నడిచాయి. ఇప్పుడు సొంతూళ్ల నుంచి హైదరాబాద్‌కు తిరిగొచ్చే సందర్భంలో రద్దీ మరింత పెరిగింది. ఇబ్రహీంపట్నం, గొల్లపూడి, కంచికచర్ల వంటి చోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. పోలీసులు అదనపు సిబ్బందిని, డైవర్షన్లు అమలుచేసి సాఫీగా ప్రయాణం కొనసాగేలా చర్యలు చేపట్టారు. అలాగే ప్రయాణికులు ఓపికగా ఉండాలని, రద్దీ ఎక్కువగా ఉన్న చోట్ల వేగం తగ్గించి, సురక్షితంగా ప్రయాణం చేయాలని సూచిస్తున్నారు.

# ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి సహకరించాలి: లోకేశ్

**స్విట్జర్లాండ్:** స్విట్జర్లాండ్ దేశంలోని ఫార్మా కంపెనీలు, యూనివర్సిటీలు ఏపీకి రావడానికి ఇక్కడి ప్రతినిధులు సహకరించాలని ఆంధ్రప్రదేశ్ ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ కోరారు. వివిధ కంపెనీలతో ఏపీని కనెక్ట్ చేసేందుకు భారత రాయబారి సహకరించాలని సూచించారు. వివిధ రంగాలకు చెందిన కంపెనీలకు అవసరమైన మ్యాన్ పవర్?ను సప్లై చేసేందుకు ఏపీ సన్నద్ధంగా ఉందని వ్యాఖ్యానించారు. యువతకు నైపుణ్యంలో శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. వంద కేజీల బరువు మోసే డ్రోన్లు తయారు చేసే కంపెనీలు ఉన్నాయని... వాటిని కనెక్ట్ చేస్తామని తెలిపారు. బీ టు బీ ద్వారా ఈ పెట్టుబడులను సాకారం చేద్దామని మంత్రి నారా లోకేశ్ సూచించారు.



## కుక్కల్ని చంపడం దారుణం: రేణూ దేశాయ్



**హైదరాబాద్, పతాకం న్యూస్:** వీధి కుక్కలను చంపడంపై ప్రముఖ సినీనటి రేణూదేశాయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల కొన్ని ప్రాంతాల్లో వీధి కుక్కల దాడుల పేరుతో వాటిని హతమార్చడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ భూమిపై ప్రతి జీవికీ జీవించే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, కుక్కలను చంపడం దారుణమని ఆమె వ్యాఖ్యానించారు. వీధి కుక్కలపై ద్వేషంతో మాట్లాడుతున్న కొందరిపై రేణూ దేశాయ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కుక్కలను వ్యతిరేకిస్తున్నవారికి పిచ్చి పట్టిందంటూ ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్కల దాడులపై వస్తున్న విమర్శలపై ఆమె ప్రశ్నల వర్షం కురిపించారు. '100 కుక్కల్లో ఐదు కుక్కలు కరిస్తే మిగతా అన్నింటినీ చంపేయాలా?' అంటూ ప్రశ్నించారు.

# 25న తిరుమలలో రథసప్తమికి విస్తృత ఏర్పాట్లు



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక రథసప్తమి ఉత్సవాలకు టీటీడీ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. సకల జీవకోటికి వెలుగునిచ్చే సూర్య భగవానుడి జన్మదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 25న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. ఒకే రోజులో స్వామివారు ఏడు వేర్వేరు వాహనాలపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమివ్వడం ఈ పర్వదినం యొక్క ప్రధాన ప్రత్యేకత. అందుకే రథసప్తమిని 'అర్ధ బ్రహ్మోత్సవం'గా కూడా పిలుస్తారు. ఉత్సవాలు తెల్లవారుజామున సూర్యోదయ వేళ సూర్యప్రభ వాహన సేవతో ప్రారంభమవుతాయి. అనంతరం చిన్నశేష వాహనం, గరుడ వాహనం, హనుమంత వాహనం, కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం మీద స్వామివారు వరుసగా భక్తులకు దర్శనమిస్తారు.


పతాకం న్యూస్ APTEL/25/A2082 PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..
అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..
పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS
State Bank of India
A/c No: 44576280686
IFSC:SBIN00021297
DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY
తెలుగు దినపత్రిక

# సంపాదకీయం

## 'ప్రైవేటు'

రాష్ట్రానికి కొత్తగా మంజూరైన వైద్య కళాశాలల ప్రైవేటీకరణకు టిడిపి కూటమి ప్రభుత్వం దూకుడు ప్రదర్శిస్తున్న సమయంలోనే, ముఖ్యమైన వైద్య సేవలన్నింటినీ ప్రైవేటీకరించాలంటూ కేంద్రం లిఖిస్తున్న వరుస లేఖలు రాష్ట్ర సర్కార్? భుజాలు చరిచి వత్తాసు పలుకుతున్నాయి. ప్రజల అవసరాలకు తగ్గట్టు వైద్య సేవలను విస్తృతం కావించడానికి ప్రభుత్వం వద్ద తగినన్ని ఆర్థిక వనరుల్లేవు కాబట్టి పిపిపి విధానమే ఏకైక మార్గమన్నది కేంద్ర సర్కార్ ఎత్తుకున్న కుహనా సిద్ధాంతం. దీని అమలుకు 27 పేజీల మార్గద ర్శకాలను రాష్ట్రానికి పంపింది. న్యూక్లియర్ మెడిసిన్, సంచార వైద్యం, దంత వైద్యం, రేడియాలజీ సేవలు, కేన్సర్? డే కేర్ సెంటర్ల వంటి వాటికి పిపిపి పద్ధతిని వర్తింపజేయాలని హుకుం జారీ చేసింది. ఎక్విప్-ఆపరేట్-మెయింటైన్ (ఇఒఎం), ఆపరేట్ అండ్ మెయింటైన్ (ఒఅండ్ఎం) మోడ్‌లో సేవల లభ్యతను పెంచాలంది. అంతేనా, ప్రైవేటుకు ఏ రకంగా దోచిపెట్టాలో కూడా గైడ్‌లైన్స్‌లో నిర్దేశించింది. న్యూక్లియర్ మెడిసిన్ సేవల కాంట్రాక్టును 5, 10 ఏళ్లకు ఇవ్వాలంది. చెల్లింపులకూ మార్గదర్శనం చేసింది. ఒక్కో స్కాన్ లెక్కన రెవెన్యూ షేరింగ్?, లేదంటే నెల నెలా ప్రత్యేక గ్రాంట్ ఇవ్వాలంది. రాగా పోగా ప్రభుత్వం ప్రజలకు కల్పించాల్సిన వైద్య సేవలు ప్రైవేట్ చేతిల్లోకి వెళతాయి. తొలుత కొంత వరకు ప్రభుత్వం చెల్లింపులు చేసి ఆపై చేతులెత్తేస్తుంది. రోగులందరికీ సేవలు అందవు. చివరికి పేదలు ప్రతి సర్వీస్‌కు ఛార్జీలు భరించాలి. ఇది కచ్చితంగా ప్రభుత్వం ప్రజారోగ్య బాధ్యత నుంచి తప్పించుకోవడమే. ప్రతి లోక్‌సభ నియోజకవర్గానికి ఒక మెడికల్ కాలేజి ఉండాలని నీతి ఆయోగ్ పేర్కొనగా, ఆ మేరకు ఎ.పి.కి 17 మెడికల్ కాలేజీలు వస్తే, వాటిలో పదింటిని పూర్తిగా సర్కారీ కాకుండా పిపిపిలో నెలకొల్పుతోంది. అందుకు వ్యతిరేకంగా వామపక్షాలు, ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు, యువత, విద్యార్థి, సామాజిక కార్యకర్తల నుంచి తీవ్ర నిరసనలు ఎగసిపడుతున్నాయి. పిపిపి వలన వైద్య విద్య మరింత ఖరీదవుతుందని, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం దెబ్బతింటాయని, పేద, గ్రామీణ ప్రాంత విద్యార్థులు వైద్య విద్యకు దూరమవుతారనే భయాలు అలముకున్నాయి. కళాశాలలకు అనుబంధంగా నడిచే ఆస్పత్రుల్లో వైద్య సేవలకు అధిక మొత్తంలో రోగుల నుంచి ఫీజులు వసూలు చేస్తారన్న ఆందోళనలు నెలకొన్నాయి. ప్రభుత్వమేమో పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని బుకాయిస్తోంది. కాలేజీలలో సీట్లను వేలం వేసి అమ్ముకునేందుకు అవకాశం ఇస్తున్నప్పుడు ఇది ప్రైవేటు కాకుండా ప్రభుత్వరంగం ఎలా అవుతుందో అర్థంకాదు. మెడికల్? కాలేజీల ప్రైవేటీకరణే పేదలకు ఇబ్బందని గగ్గోలు పెడుతుండగా, ఇక ముఖ్యమైన సేవలన్నీ ప్రైవేటుపరం అయితే ప్రజల ఆరోగ్యం గాలిలో పెట్టిన దీపం మాదిరే అవుతుంది. కాస్తంత సర్కారీ సేవలు అందుబాటులో ఉన్నప్పుడే కార్పొరేట్ల దోపిడీకి బాధితులు ఆస్తులు అమ్ముకుంటున్నారు. ఆరోగ్యశ్రీ వంటివి ఉన్నా లేనట్లే. కరోనాలో అమెరికా సహా పెద్ద దేశాల్లో వైద్యం కార్పొరేటీకరణ వలన ప్రజలు ఆరోగ్య సేవలందక పడ్డ దయనీయతను చూశాం. ఆ పరిస్థితులు ఇక్కడ లేకపోవడానికి ఒకింత ప్రభుత్వరంగమే కారణం. కాగా కేంద్రం ఆదేశాల మేరకు అన్ని సేవలకు పిపిపి అంటే పరిస్థితి ఇంకెంత దారుణంగా ఉంటుందో ఊహకందదు. నయా-ఉదార విధానాల యుగంలో ప్రపంచంలోని పాలకులు ఉచ్ఛరిస్తున్న తారక మంత్రం పిపిపి. ప్రభుత్వాలు సామాజిక, ప్రజారోగ్యం, సంక్షేమం, మౌలిక వసతులకు నిధులు ఖర్చు చేయవు. వాటన్నింటినీ ప్రైవేట్‌కు అప్పగిస్తాయి. భారీగా పెట్టుబడులు పెట్టిన సంస్థలు ఊరికినే ఉంటాయా? తమ లాభాల వేటలో ప్రభుత్వ అండదండలతో ప్రజల మూలగ పీలుస్తాయి. మోడీ 'వికసిత భారత్' ఇదే. పిపిపి విషయంలో ఎ.పి. అందరికంటే ముందున్నదని టిడిపి కూటమి ప్రభుత్వం, దానికి మద్దతిచ్చే ఆర్థిక మేధావులు, మీడియా డప్పుకొట్టడం వింత అనిపించదు. కేంద్రం ప్రతిపాదించిన పిపిపి ప్రాజెక్టులలో మనవే 30 శాతమని చెప్పడం రాష్ట్రంలో పాలక, ప్రధాన ప్రతిపక్షం కేంద్ర బిజెపి ప్రభుత్వ విధానాలను సంపూర్ణంగా బలపరుస్తున్నందున పిపిపి విధానాల అమలుకు మన రాష్ట్రం ప్రయోగశాలగా మారనుంది. కేంద్రం అడుగు జాడల్లో ప్రైవేటు నష్టాలను పూడ్చేందుకు వయబిలిటీ గ్యాప్ ఫండ్ కింద రూ.2 వేల కోట్లను బడ్జెట్‌లో కూటమి సర్కార్ ప్రతిపాదించింది. బిజెపి పాలిత రాష్ట్రం, మోడీ, అమిత్‌షా ఇలాకా గుజరాత్‌లో కూడా ఇంత లేదు. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణను చంద్రబాబు ప్రభుత్వం అంతగా భుజానికెత్తుకోవడం ఈ రాష్ట్ర ప్రయోజనాలకు హానికరం.

## హైవేకు 500మీటర్ల పరిధిలో మద్యం షాపులపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** జాతీయ, రాష్ట్ర రహదారులకు 500 మీటర్ల పరిధిలో మద్యం షాపుల తొలగింపుపై సుప్రీం కోర్టు కీలక ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారులపైన ఉన్న వైన్ షాపులను తొలగించడం లేదా తరలించాలంటూ రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఈ మేరకు ఆదేశించింది. హైకోర్టు ఇచ్చిన తీర్పు సరైందేనని చెప్పిన సుప్రీం, కానీ తీర్పుపై సమగ్ర అధ్యయనం అవసరమని అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాద మరణాలపై ఆందోళన వ్యక్తం చేసిన సుప్రీం కోర్టు, మద్యం మత్తులో వాహనం నడపడం పెను ప్రమాదానికి దారి తీస్తుందని చెప్పింది. 2025 నవంబర్ 24న రాజస్థాన్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ రామ్ స్వరూప్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది.

## విజయసాయి ట్వీట్‌పై స్పందించిన మాధవ్



**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** ఏపీ రాజకీయాల్లో త్వరలోనే సంచలన పరిణామాలు చోటుచేసుకోనున్నాయని రాష్ట్ర బీజేపీ చీఫ్ మాధవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత వైసీపీ ప్రభుత్వం కేవలం లిక్కర్ అవినీతికి మాత్రమే పరిమితం కాకుండా అనేక అక్రమాలు, అరాచకాలకు పాల్పడిందని విమర్శించారు. అక్రమాలకు పాల్పడిన వారెవరికైనా తప్పకుండా శిక్ష పడుతుందని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం పెద్ద ఎత్తున చర్యలు తీసుకోబోతోందని వెల్లడించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి తాజాగా చేసిన ట్వీట్ పై స్పందిస్తూ ఆయన ఈ మేరకు స్పందించారు. అనంతరం పార్టీ విషయాలపై మాట్లాడుతూ, బీజేపీలో మూడేళ్లకు ఒకసారి జాతీయ అధ్యక్షుడు మారే సంప్రదాయం ఉందని చెప్పారు. కార్యకర్తలకు ప్రాధాన్యం ఇచ్చే పార్టీ బీజేపీ అని, దేశవ్యాప్తంగా పార్టీకి ప్రత్యేక గుర్తింపు ఉందన్నారు. బీజేపీ జాతీయ నూతన అధ్యక్షుడి ఎన్నిక నేపథ్యంలో తాము ఢిల్లీకి వచ్చామని వివరించారు. నితిన్ నబీన్‌కు మద్దతుగా ఏపీ బీజేపీ తరఫున రెండు సెట్ల నామినేషన్ పత్రాలు దాఖలు చేస్తున్నామని మాధవ్ తెలిపారు. ఒక్కో సెట్లో 20 మంది సభ్యులు ఉండేలా నామినేషన్లు వేస్తున్నామని చెప్పారు. మరోవైపు, ఈరోజు సాయంత్రం 4 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ కొనసాగనుంది. సాయంత్రం 4 నుంచి 6 వరకు నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ ఉంటుంది. అనంతరం, సాయంత్రం 6 గంటలకు పార్టీ జాతీయ కొత్త అధ్యక్షుడి పేరును బీజేపీ అధిష్ఠానం ప్రకటిస్తుంది. ఒకవేళ ఏకగ్రీవం అయితే, నిర్ణీత సమయం కంటే ముందే ప్రకటించే అవకాశం ఉంది.

## నేడు ప్రసన్నాంజనేయ స్వామి వార్షిక మహోత్సవం..ముస్తాబైన దేవాలయం



**నక్కపల్లి, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని ఉద్దండ పురం గ్రామంలో గల ప్రసన్నాంజనేయ వార్షిక మహోత్సవం మంగళవారం జరగనున్నది. అంగరంగ వైభవంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఆలయ చైర్మన్ పొడగట్ల రమణ (అబ్బాయి మాస్టర్) తోపాటు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ప్రసన్నాంజనేయ స్వామి జాతర మహోత్సవానికి జరిగే కార్యక్రమాల వివరాలు ఇలా 20వ తేదీ మంగళవారం ఉదయం 7 గంటల నుండి స్వామివారి ప్రత్యేక పూజా కార్యక్రమం మొదలవుతుందని అన్నారు. ఉదయం 8-30 గంటల నుండి భజనలు, "కేరళ వాయిద్యాలతో " స్వామివారి ఉత్సవ విగ్రహం గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. సాయంత్రం 4-00 గంటల నుండి రాత్రి 8-00 గంటల వరకు సీతంపాలెం గ్రామ వారిచే " శ్రీ కృష్ణ కోలాటం " కార్యక్రమము జరుగుతుందని, రాత్రి 8-30 గంటల నుండి ఎం వి ఆర్ డాన్స్ ఈవెంట్, ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో "డ్యాన్స్ ఈవెంట్ " కూడా ఉంటుందని తెలిపారు. రాత్రి 11-00 గంటల నుండి విజయనగరం వారిచే "బుర్రకథ " కార్యక్రమం లైటింగ్ ఏపీ సౌండ్స్, ఉద్దండపురం రాత్రి 11-30 గంటల నుండి ఉద్దండపురం, సామర్లకోట, సీతారామపురం, వేమగిరి, రాజుపేట, నెల్లిపూడి, జానకయ్యపేట గ్రామలు వారిచే "తప్పెడుగుళ్లు" కార్యక్రమాలు అత్యధిక వైభవంగా జరుగుతాయని చెప్పారు. అలాగే 21వ తేదీ బుధవారం ఉదయం నుండి కూడా స్వామివారి అన్న ప్రసాదం కార్యక్రమం భారీ ఎత్తున జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాలన్నీ కూడా గ్రామంలో ఉన్న గ్రామ పెద్దలు, యువకులు, భక్తులు, ప్రజల సహాయ సహకారాలతో నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులు పేర్కొన్నారు. స్వామివారి దర్శనార్థం వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వామివారిని దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసామని తెలిపారు.

## పోలవరం ప్రాజెక్టు పురోగతిని పరిశీలించిన విదేశీ నిపుణుల బృందం



**పోలవరం, పతాకం న్యూస్:** పోలవరం సవాళ్లను అధిగమించేందుకు కేంద్రం నియమించిన విదేశీ నిపుణుల బృందం ఆరోసారి ప్రాజెక్టును సందర్శించింది. ఈ బృందంలో విదేశీ నిపుణులు సీన్ హించిబెర్గర్, డేవిడ్ బిపాల్, జియాన్ ఫ్రాంకో డిసిస్కో ఉన్నారు. వీరు పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో నేడు ఆరోసారి పర్యటించారు. వీరి వెంట కేంద్ర జల సంఘంలోని వివిధ విభాగాల అధికారులు సరబ్జిత్ సింగ్ బక్షి, మనీష్ రాథోర్, గౌరవ్ తివారి, హేమంత్ గౌతమ్, సీఎస్ఆర్ఎంఎస్ అధికారులు మనీష్ గుప్తా, రవి అగర్వాల్, సీడబ్ల్యూపీఆర్ ఎస్ ప్రతినిధి వి.ఎస్ రామారావు, పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎం. రఘురాం, డైరెక్టర్ కె. శంకర్, ఆంధ్రప్రదేశ్ జలవనరుల శాఖ సలహాదారు ఎం. వెంకటేశ్వర రావు, ఎన్ఐఆర్ఎం డైరెక్టర్ అజయ్ కుమార్ నైతాని, సీడీఓచీఫ్ ఇంజనీర్ ఉన్నారు. నిపుణుల బృందానికి జలవనరుల శాఖ ఈఎన్‌సీకే నరసింహమూర్తి, పోలవరం ఎస్ఈ రామచంద్ర రావు, ఏంఈఐఎల్ జనరల్ మేనేజర్ గంగాధర్, డీజీఎం మురళి పమ్మి స్వాగతం పలికారు. ప్రాజెక్ట్ పనుల పురోగతిని నిపుణుల బృందానికి జలవనరుల శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ ఏంఈఐఎల్ ప్రతినిధులు వివరించారు. గ్యాప్-1, డి-హిల్, గ్యాప్-2, జి-హిల్, ప్రధాన డాం ఎగువ, దిగువ భాగాలు, డి-వాల్, డి-వాటరింగ్ ఛానల్, రాక్ ఫిల్, క్లే స్టాక్‌ను నిపుణుల బృందం పరిశీలించింది. ఇప్పటికే విదేశీ నిపుణుల బృందం పర్యటనల్లో అనేక సిఫార్సులు చేసింది. అప్పట్లో డి వాల్ పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇలాగే సాగితే అనుకున్న సమయానికి పని పూర్తికాదని పేర్కొంది. తాజా పరిస్థితుల ప్రకారం డి వాల్‌లో కొంత వేగం పెరిగింది. దాదాపు 50% పనులు పూర్తయ్యాయి. డి వాల్ బ్లీడింగ్‌పై అప్పట్లో చర్చలు జరిగాయి. ఉష్ణోగ్రత, ఇతరత్రా మార్పుల వల్ల ఆ సమస్య పరిష్కారమైందని అధికారులు పేర్కొంటున్నారు. కోర్ తీసి పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. ఆకృతుల రూపకల్పనకు డేటాను ఆధునికీకరించాలని సిఫార్సు చేశారు. డైనమిక్ సిస్మిక్ విశ్లేషణ లేదని పేర్కొన్నారు. ఇంకా పురోగతి సాధించాల్సి ఉంది. ప్రధాన డ్యాం నిర్మాణ ప్రాంతంలో సీపేజి నీళ్లు నిల్వ ఉండకుండా పంపుల సామర్థ్యం సరిపోతుందా లేదా అనేది నిర్ధారించాలని గతంలో సూచించారు. ఈ వరద కాలంలో గోదావరిలో తక్కువ ప్రవాహాలే ఉన్నాయి. ఇంతవరకు ఆ ఇబ్బంది లేదు. నాణ్యత మదింపు మాన్యువల్ సిద్ధం చేశారు. తుదిరూపు రావాల్సి ఉంది. ప్రాజెక్టు నిర్మాణ షెడ్యూలుకు తుదిరూపు ఇవ్వాలని గతంలో సిఫార్సు చేశారు. ప్రైమావీరా సాఫ్ట్‌వేర్ ఆధారంగా దాన్ని సమీక్షించాలనేది ఉద్దేశం. తుదిరూపు రావాల్సి ఉంది. పోలవరం ప్రాజెక్టులో భారీ వరదల వల్ల నేల స్వభావం మారిపోయింది. అక్కడ డీప్ సాయిల్ మిక్సింగ్ చేయాలి. ఆ మెథడాలజీకి విదేశీ నిపుణుల బృందం ఇప్పటికే సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. అయితే మరో విధానాన్ని కూడా ఒక నిపుణుడు ప్రతిపాదించి అందులోని లాభనష్టాలు అధ్యయనం చేయాలని పేర్కొన్నారు. దాదాపు 550 మీటర్ల మేర డీప్ సాయిల్ మిక్సింగ్ చేయాల్సి ఉంటుంది. 12 నుంచి 16 మీటర్ల లోతు వరకు చేయాలి. వైబ్రో కాంపాక్షన్ పనులకు సంబంధించి తిరుపతి ఐఐటీ చేసిన అన్ని పరీక్షల ఫలితాలు సమర్పించారు. తాము అధ్యయనం చేసిన తర్వాత అభిప్రాయాలు తెలియజేస్తామని విదేశీ నిపుణులు పేర్కొన్నారు.

## సార్లంక అగ్ని ప్రమాద బాధితులకు గిరిజన సంఘం ఆర్థిక సహాయం



**రాజవొమ్మంగి, పతాకం న్యూస్ :** కాకినాడ జిల్లా రౌతులపూడి మండలం సార్లలంక గ్రామంలో ఇటీవల జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో సుమారు 50 ఇల్లు అగ్నికి ఆహుతై కట్టుబట్టలతో గిరిజనలు రోడ్డున పడిన నేపథ్యంలో గిరిజన సంఘం మండల ఉపాధ్యక్షులు పాండవుల సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఆ గ్రామాన్ని సందర్శించి అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని అండగా ఉంటామని తెలిపారు.ఆ అగ్ని ప్రమాదం బాధిత గిరిజనులకు గిరిజన సంఘం ఆధ్వర్యంలో మండలంలోని చికిలింత పంచాయితీ గ్రామాల్లో ఫండ్ క్యాంపెయిన్ నిర్వహించి గిరిజనులకు కొంత ఆర్థిక సహాయం, బియ్యం,ఇతర నిత్యవసర సరుకులు, బట్టలు అందజేశారు. మరి అంత సాయం అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పొత్తూరి రాంబాబు పాండవుల దుర్గా,ఎం శ్రీలక్ష్మి,కె రాజమణి,కె సత్తిబాబు,పి రాంబాబు, సిద్దా లోవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

(మొదటిపేజీ తరువాయి)

## చంద్రబాబుకు ఘన స్వాగతం

ముఖ్యమంత్రి చంద్రబాబుతో భారత రాయబారి మృదుల్ కుమార్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఏపీలో పెట్టుబడులకు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. ఈ భేటీకి మంత్రి నారా లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడారు. స్విట్జర్లాండ్ దేశంలోని ప్రముఖ కంపెనీల వివరాలు, పెట్టుబడుల సాధనకు ఉన్న అవకాశాలపై చర్చించామని తెలిపారు. ఏపీలో పెట్టుబడులు పెట్టేలా స్విట్జర్లాండ్ కంపెనీలతో సంప్రదింపులు జరిపేందుకు సహకరించాలని భారత రాయబారి మృదుల్ కుమార్‌ను కోరినట్లు వెల్లడించారు. ఫార్మా, వైద్య పరికరాలు, మిషనరీ తయారీ, హార్డ్‌వేర్-ఎలక్ట్రానిక్స్, రైల్ కంపోనెంట్స్, టెక్నికల్ టెక్స్ టైల్స్, ఆర్ అండ్ డీ కేంద్రాలు వంటి రంగాల్లో సహకారం కోరామని చెప్పుకొచ్చారు. ఈ మేరకు ఏపీ తెచ్చిన పాలసీలను... పారిశ్రామిక ప్రగతి కోసం తీసుకున్న నిర్ణయాలను భారత్ అంబాసిడర్?కు వివరించారు. 2025లో చేపట్టిన దావోస్ పర్యటన సక్సెస్ అయిందని.. సుమారు రూ. 2 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు సాకారమయ్యాయని మృదుల్ కుమార్ తెలిపారు. ఎన్నార్టీల భాగస్వామ్యంతో రాష్ట్రాభివృద్ధికి మరింత దోహదం చేసే విధంగా కృషి చేయాలని సీఎం సూచించారు. మధ్య యూరప్‌లోని లిచ్టెన్ స్టైన్ అనే దేశంలో జరుగుతున్న ఏఐ ప్రగతికి సంబంధించిన వివరాలను సీఎంకు వివరించారు మృదుల్ కుమార్.నేడు ఏ దేశానికి తాము వెళ్లినా భారతీయుల విజయాలు గర్వకారణంగా ఉంటున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యానించారు. నేడు ప్రపంచంలో అనేక దేశాలు మానవ వనరుల కొరతతో ఉన్నాయని తెలిపారు. భారతదేశం యువశక్తితో సిద్ధంగా ఉందని చెప్పుకొచ్చారు. ప్రపంచ మానవ వనరుల కొరతకు సమాధానం భారతదేశంలోనే లభిస్తుందని తెలిపారు. లిచ్టెన్ స్టైన్ వంటి దేశంలో ఏఐ పురోగతి ఆసక్తిదాయకంగా ఉందని వివరించారు. ఫిబ్రవరిలో భారతదేశంలో జరిగే ఏఐ సదస్సులో లిచ్టెన్ స్టైన్ దేశ ప్రతినిధులతో సమావేశమవుతానని వెల్లడించారు. ప్రకృతి సేద్యంలో ఏపీ దేశంలోనే అగ్రస్థానంలో ఉందని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

# చోడవరం కోఆపరేటివ్ షుగర్స్ రైతుల బకాయిలు వెంటనే చెల్లించాలి



**చోడవరం, పతాకం న్యూస్ :** అనకాపల్లి జిల్లా చోడవరం కోఆపరేటివ్ షుగర్స్‌కు చెందిన చెరకు రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నారని పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ఈ విషయానికి సంబంధించి నేడు అనకాపల్లి జిల్లా కలెక్టర్ గారిని రైతులతో కలసి కలిసి లిఖిత పూర్వక విజ్ఞపన పత్రాన్ని అందించారు 2024--2025 క్రషింగ్ సీజన్‌లో షేర్‌హోల్డర్ రైతులు సుమారు 1,08,000 మెట్రిక్ టన్నుల చెరకు సరఫరా చేయగా, దాని ద్వారా సుమారు 5,000 టన్నుల పంచదార ఉత్పత్తి జరిగింది. రైతులకు చెల్లించవలసిన మొత్తం సుమారు రూ.32 కోట్లు కాగా, ఇప్పటివరకు ఫ్యాక్టరీ యాజమాన్యం కేవలం రూ.5.83 కోట్లు మాత్రమే చెల్లించిందని ఆయన పేర్కొన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి కారణంగా బాధిత రైతులు ఆంధ్రప్రదేశ్ గౌరవ హైకోర్టును ఆశ్రయించారని తెలిపారు. రైతుల కష్టాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు, ఫ్యాక్టరీ వద్ద ఉన్న పంచదార నిల్వలను విక్రయించి రైతుల బకాయిలు చెల్లించాలని డబ్ల్యూపీ నెం. 4580/2025, తేదీ 20.02.2025లో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు సుమారు 50,000 క్వింటాళ్ల పంచదారను, దాదాపు రూ.17.5 కోట్లకు విక్రయించినప్పటికీ రైతులకు ఇప్పటివరకు కేవలం రూ.5.83 కోట్లు మాత్రమే చెల్లించారని, మిగిలిన రూ.11.67 కోట్లు రైతులకు అందలేదని ఆయన ఆరోపించారు. ఈ మొత్తాన్ని ఇతర అవసరాలకు మళ్లించారనే అనుమానాలు తమకు ఉన్నాయని, ఇది హైకోర్టు ఆదేశాలను ఉల్లాంఘించడమేనని అన్నారు. ఒక సంవత్సరానికి పైగా రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు, మానసిక వేదన అనుభవిస్తున్నారని, ఈ పరిస్థితి ప్రభుత్వానికి మరియు సహకార వ్యవస్థకు అపఖ్యాతిని తెచ్చేలా ఉందని పీవీఎస్ఎన్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై జిల్లా కలెక్టర్ తక్షణ విచారణ జరిపించాలన్నారు.

## పడిపోయిన టమాటా ధర



**కృష్ణాదేవిపేట, పతాకం న్యూస్:** టమాటా ధర ఒక్కసారిగా పడిపోయింది. గత కొన్ని నెలలుగా ఆకాశాన్నంటిన టమాటా ధర ఇప్పుడు దిగజారిపోయింది. గత వారం కృష్ణాదేవిపేట మార్కెట్‌లో క్రేటు(30 కిలోలు) రూ.800 పలకగా, రూ.330 నుంచి రూ.350 మధ్య అమ్మకాలు సాగాయి. గత ఏడాది నవంబరు, డిసెంబరు నెలల్లో ఇదే క్రేటు రూ.1000కు పైబడి ధర పలికింది. కృష్ణాదేవిపేట మార్కెట్‌కు కొయ్యూరు, గొలుగొండ మండలాల్లో గల ఏఎల్‌పురం, చోద్యం, గిరాంపేట, లింగంపేట, పాడి, రత్నంపేట, కినపర్తి, వలసంపేట, భీమవరం, పి.మాకవరం, సీహెచ్? నాగాపురం, తదితర గ్రామాల రైతులు వందలాది కిలోల టమాటాను తెచ్చారు. అయితే సరైన ధర పలకకపోయినా వ్యాపారులకు విక్రయించారు. ధర రోజురోజుకూ తగ్గిపోవడంతో ఆవేదన వ్యక్తం చేశారు.

## డయాలసిస్ యూనిట్‌కు రోగుల తాకిడి



**నర్సీపట్నం, పతాకం న్యూస్:** నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలోని డయాలసిస్ యూనిట్‌కు రోగుల తాకిడి పెరుగుతోంది. దీంతో యూనిట్‌లోని మంచాలు సరిపోవడం లేదు. మూడు సెషన్స్‌లో పని చేయాల్సిన యూనిట్ నాలుగో సెషన్‌లో కూడా డయాలసిస్ సేవలు అందించాల్సి వస్తున్నది. దూర ప్రాంతాల నుంచి వస్తున్న రోగులు, వారితో వచ్చిన సహాయకులు రాత్రి వరకు ఉండిపోవాల్సి వస్తున్నది. 21 మంచాలతో డయాలసిస్ క్లినిక్ యూనిట్ పెట్టారు. జిల్లాలో ఇదే అతి పెద్ద డయాలసిస్ యూనిట్. రాష్ట్ర ప్రభుత్వం పీపీపీ విధానంలో నెఫ్రో ప్లస్‌కి నిర్వహణ బాధ్యతలు అప్పగించింది. సోమవారం నుంచి శనివారం వరకు ఆరు రోజులు ఈ యూనిట్‌లో సిబ్బంది సేవలు అందిస్తున్నారు. ప్రతీ నెలా మొదటి, మూడో గురువారం నెఫ్రాలజిస్ట్ (మూత్ర పిండాల స్పెషలిస్ట్) వస్తుంటారు. ఇటీవల మెడికల్ ఆఫీసర్‌ను నియమించారు. డయాలసిస్ చేసినందుకు ఒక సెషన్‌కి రూ.1,113 చొప్పున నెఫ్రో ప్లస్‌కి ప్రభుత్వం చెల్లిస్తున్నది. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నంలో మాత్రమే డయాలసిస్ క్లినిక్‌లు ఉన్నాయి. నర్సీపట్నంలో 21 మంచాలు ఉంటే, అనకాపల్లి డయాలసిస్ క్లినిక్‌లో 4 మంచాలు మాత్రమే ఉన్నాయి. మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతున్న రోగుల సంఖ్య ప్రతీ సంవత్సరం పెరుగుతుండడం వలన ఇక్కడ డయాలసిస్ యూనిట్ సరిపోవడం లేదు. ఇక్కడ యూనిట్‌లో ఒక సెషన్‌కి 21 మంది చొప్పున మూడు సెషన్స్‌లో 63 మందికి సేవలు అందిస్తున్నప్పటికీ నాలుగో సెషన్‌కి కూడా రోగులు ఉంటున్నారు. ఒకసారి డయాలసిస్ చేయాలంటే నాలుగు గంటల సమయం పడుతుంది. దీని వలన దూర ప్రాంతాల నుంచి వచ్చే రోగులు రాత్రి 9 గంటలు దాటే వరకు ఉండిపోవలసి వస్తున్నది. నర్సీపట్నం చుట్టుపక్కల మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు ఇక్కడకు వస్తున్నారు. కొయ్యూరు, గొలుగొండ మండలాల నుంచి డయాలసిస్‌కి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందని నిర్వాహకులు చెబుతున్నారు. దీంతో నర్సీపట్నంలోని డయాలసిస్ క్లినిక్‌ను విస్తరించాలని పలువురు కోరుతున్నారు.

## 19 నుండి 31 వరకు ప్రత్యేక ఉచిత పశువైద్య శిబిరాలు



**గొలుగొండ, పతాకం న్యూస్:** గొలుగొండ మండలంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19 నుంచి 31వ తేదీ వరకు పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం కొమిర,ఏజెన్సీ లక్ష్మీ పురం,చోద్యం గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరం జరిగింది. ఈ శిబిరాన్ని గొలుగొండ డా.ఆర్.జె.దుర్గ ప్రసాద్,చోద్యం డా.పైల సురేష్,కృష్ణదేవిపేట డా.జి.వి.ఎం.శిరీష ఆధ్వర్యంలో నిర్వహించారు. శిబిరంలో 32 పశువులకు గర్భకోస వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. దూడలు,మేకలు, గొర్రెలకు నట్టల నివారణ మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అదేవిధంగా పాడి రైతులకు శాస్త్రీయ యాజమాన్యం,పశు బీమాపై అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఎల్.పురం సర్పంచ్ లోచల సుజాత,స్థానిక నాయకులు,పాడి రైతులు,1962 సిబ్బంది,వెటర్నరీ అసిస్టెంట్ శ్రీరామ్ మూర్తి,అసిస్టెంట్స్ పి.హరికుమార్, డి.అనూష,పి.శ్రావణి,ఎన్.నాగదుర్గ, ఎమ్.లావణ్య మరియు పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## డౌనూరు పశువైద్యాలయం పరిధిలో పశు ఆరోగ్య శిబిరాలు

**కొయ్యూరు, పతాకం న్యూస్:** అల్లూరి జిల్లా,కొయ్యూరు మండలం, డౌనూరు పశు వైద్యాలయం పరిధిలోని డౌనూరు,చిట్టెంపాడు గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు.ఈ శిబిరాల్లో పశువులు,దూడలు,గొర్రెలు,మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేయడంతో పాటు,కోళ్లకు టీకాలు వేశారు.అనారోగ్యంతో ఉన్న పశువులకు చికిత్స అందించారు.దాదాపు 60 మేకలు,75 దూడలకు నట్టల మందులు వేసినట్లు డా. రాజశేఖర్ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన పశు భీమా రైతుకి ధీమా అనే నినాదంతో రైతులు అందరూ తప్పకుండా పశు భీమా చేయించుకోవాలని సూచించారు.పశు భీమా వలన కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.ఈ కార్యక్రమంలో పశువైద్య సహాయకులు తోమరాజు, సత్యనారాయణతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## తిరుగు ప్రయాణాలతో రద్దీ

### ప్రయాణీకులతో రైల్వే స్టేషన్ ఆర్టీసీ కాంప్లెక్స్ కిటకిట



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** సంక్రాంతి తిరుగు ప్రయాణికులతో రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్ రద్దీగా మారాయి. అత్యధిక మంది పండుగ సంబరాలు ముగించుకుని గమ్యస్థానాలకు బయలుదేరడంతో విశాఖ రైల్వే స్టేషన్, ద్వారకా బస్‌స్టేషన్‌లో సందడి వాతావరణ ఏర్పడింది. దాదాపు అన్ని రైళ్లకు ప్రయాణికులు పోటెత్తడంతో ప్లాట్‌ఫారాలు కిటకిటలాడాయి. ద్వారకా బస్‌స్టేషన్‌లో కూడా ఇంచుమించుగా పరిస్థితి ఇలానే వుంది. ఆర్టీసీ అధికారులు వివిధ ప్రాంతాలకు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. సంక్రాంతి పండుగ సంబరాలకు ఇతర ప్రాంతాల నుంచి విశాఖ చుట్టుపక్కల ప్రాంతాలకు వచ్చిన వారిలో అత్యధిక శాతం మంది ఆదివారం తిరుగు ప్రయాణంలో కావడంతో ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్, ఇంటర్‌సిటీ, పాసింజర్ రైళ్లు రద్దీగా మారాయి. గోదావరి, గరీబ్‌రథ్, మహబూబ్‌నగర్, నాందేడు, దురంతో, ఎల్‌టీటీ, వందేభారత్, రత్నాచల్, జన్మభూమి, సింహాద్రి వంటి విశాఖ ఒరిజినేటింగ్ రైళ్లతోపాటు విశాఖ మీదుగా చెన్నై, బెంగళూరు వెళ్లే మెయిల్, కోరమండల్, ప్రశాంతి ఎక్స్‌ప్రెస్ రైళ్లకు సుమారు నెలరోజుల క్రితమే రిగ్రెట్ ఏర్పడిన నేపథ్యంలో రిజర్వేషన్ లేని ప్రయాణికులు జనరల్ కోచ్‌లకు ఆశ్రయించాల్సి వచ్చింది. విద్య, ఉద్యోగ, వ్యాపార కార్యక్రమాలకు హాజరుకానున్న నేపథ్యంలో తిరుగు ప్రయాణాలు ఊపందుకున్నాయి. ప్రయాణికులు పోటెత్తడంతో రైళ్లకు తీవ్ర రద్దీ ఏర్పడింది. తప్పనిసరిగా గమ్యాలకు చేరాల్సి ఉండడంతో రద్దీని సైతం లెక్కచేయకుండా ప్రయాణాలు చేశారు. దీంతో సాధారణ కోచ్‌ల్లో ఒంటి కాలితో ప్రయాణం చేయాల్సి వచ్చింది. మధ్యాహ్నం రత్నాచల్ ఎక్స్‌ప్రెస్‌కు తీవ్ర రద్దీ ఏర్పడింది. విజయవాడ నుంచి విశాఖకు చేరిన వారితోపాటు ఇక్కడ నుంచి విజయవాడ వైపు వెళ్లేవారు ఒకేసారి ప్లాట్‌ఫారం మీద వుండడంతో జాతరను తలపించింది. గోదావరి, విశాఖ, మహబూబ్‌నగర్, ఎల్‌టీటీ ఎక్స్‌ప్రెస్‌లతోపాటు ప్రత్యేక రైళ్లకు రద్దీ ఏర్పడడంతో జనరల్ బోగీలు కిక్కిరిశాయి. చెన్నై, బెంగళూరు, భువనేశ్వం, హౌరా వైపు వెళ్లే రైళ్లలో కూడా ఇదే పరిస్థితి నెలకొన్నది. భువనేశ్వర్ వైపు వెళ్లే రైళ్లలో జనరల్ కోచ్‌ల్లో ప్రయాణించిన వారి ఇక్కట్లు వర్ణణాతీతం. సంక్రాంతి పండుగ తిరుగు ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ విశాఖ రీజియన్ యాజమాన్యం 243 ప్రత్యేక సర్వీసులు నడిపింది. వీటిల్లో సగానికిపైగా సర్వీసులు విజయవాడ, రాజమహేంద్రవరం, కాకినాడ, హైదరాబాద్‌కు నడిపారు. తిరుగు ప్రయాణికులతో ద్వారకా బస్టేషన్‌తోపాటు మద్దిలపాలెం బస్టేషన్? కూడా రద్దీగా మారింది. ఉద్యోగం, ఉపాధి, వ్యాపారం, ఉన్నత విద్య నిమిత్తం వేరే ప్రాంతాల్లో వుంటున్నవారు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకోవడానికి వారం రోజుల క్రితం సొంతూళ్లకు వచ్చారు. సంక్రాంతి ముగియడంతో తిరిగి గమ్యస్థానాలకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. దీనితో ప్రయాణికుల తాకిడి పెరిగింది. రోజూ నడిచే బస్సు సర్వీసులు చాలకపోవడంతో 243 ప్రత్యేక సర్వీసులు నడిపారు. దూరప్రాంతాలైన విజయవాడకు 40, రాజమహేంద్రవరానికి 40, కాకినాడకు 20, హైదరాబాద్‌కు 8 చొప్పున ప్రత్యేక బస్సులు నడిపారు. ఇక ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళానికి 30, పలాసకు 20, టెక్కలికి 15, సోంపేటకు 10, మందసకు 10, పాతపట్నానికి ఐదు, విజయనగరానికి 20, బొబ్బిలికి 10, సాలూరుకు 10, రాజాంకు ఐదు ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నారు. సోమవారం కూడా తిరుగు ప్రయాణికుల రద్దీ ఉంటుందని, అందువల్ల 300 ప్రత్యేక సర్వీసులను సిద్ధం చేస్తున్నామని రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు తెలిపారు.

## గొల్లపాలెంలో ఉచిత పశు వైద్య శిబిరాలు




**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలంలో పలు గ్రామాలలో ఉచిత ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెలాఖరు వరకు నిర్వహిస్తున్న పశు ఆరోగ్య శిబిరాలను గొల్లలపాలెంలో ప్రారంభించారు. డా.నూకేష్,డా.దమయంతి, సర్పంచ్ విసారపు రమణాజీ ప్రారంభించారు. అందులో భాగంగా సోమవారం దిబ్బలపాలెం మరియు ఆర్ల గ్రామాల్లో రెండు బృందాలుగా వెటర్నరీ సిబ్బంది సుమారు 197 పశువులకు మందులు పంపిణీ చేపట్టారు.శిబిరంలో మందులు, వాక్సినేషన్, నట్టల నివారణ,ఎద మందులు, వైద్య సేవలు ఉచితంగా అందచేస్తామని,రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.పశు వైద్య అధికారులు మాట్లాడుతూ ఈ పశు ఆరోగ్య శిబిరాలు ఈ నెలాఖరు వరకు వివిధ మారుమూల గ్రామాల్లో జరుగుతాయని ఈ సేవలును రైతులు సద్వినియోగంచేసుకునేలా పత్రికా ప్రతినిధులును,ప్రజా ప్రతినిధులు,అభ్యుదయ రైతులు సహకరించవలసినదిగా కోరారు.

## నూతన భవన నిర్మాణాలకు సహకారం కరువు



**మాడుగుల, పతాకం న్యూస్:** మండలంలోని ప్రా?థమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల (పీఏసీఎస్‌ల) భవనాలు చాలా వరకు శిథిలావస్థకు చేరినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. దీంతో అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఏటా కోట్లాది రూపాయల టర్నోవర్ జరుగుతున్నా పరాయి పంచన కొనసాగాల్సిన దుస్థితి నెలకొంది. మాడుగులలోని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు పరిధిలో 10 ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఉన్నాయి. మాడుగుల మండలానికి సంబంధించి ఎనిమిది పీఏసీఎస్‌లు ఉన్నాయి. వీటిలో మాడుగుల, కేజేపురం, ఎం.కోడూరు, ఎం.కె.వల్లాపురం, వీరవిల్లి అగ్రహారం, వీరనారాయణం, వమ్మలి, కింతలి ఉన్నాయి. అలాగే బుచ్చయ్యపేట మండలంలో వడ్డాది, బంగారుమెట్ట పీఏసీఎస్?లతో కలిపి మొత్తం పది ఉన్నాయి. మాడుగుల మండలానికి సంబంధించి ఎనిమిది పీఏసీఎస్‌ల్లో మాడుగుల, ఎం.కె.వల్లాపురం, వీరనారాయణం, వీరవిల్లి అగ్రహారంలోని భవనాలు బాగానే ఉన్నాయి. అయితే మిగిలిన ఎం.కోడూరు, వమ్మలి, కింతలి, కేజేపురం భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. 2014లోనే ఇవి శిథిలావస్థకు చేరుకున్నా 2017 వరకు సిబ్బంది అందులోనే విధులు నిర్వహించారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో ఆ తరువాత అద్దె భవనాల్లోకి మారారు. కేజేపురం, వమ్మలి శిథిల భవనాలను అలాగే వదిలేశారు. ఎం.కోడూరు, కింతలి భవనాలను కూల్చివేశారు. వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాల్సి ఉన్నా ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఆయా పీఏసీఎస్‌ల్లో రైతులకు రుణాల రూపంలో ఏటా కోట్లాది రూపాయల టర్నోవర్ జరుగుతోంది. ఒక్కో సంఘం సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లకు పైబడి ఏటా టర్నోవర్ చేస్తోంది. ఒక్కో సంఘంలో సుమారు వెయ్యి మంది సభ్య రైతులు ఉన్నారు. అద్దె భవనాలకు నెలకు రూ.వేలల్లో చెల్లింపులు జరపాల్సి వస్తోంది. పైగా అద్దె భవనాల్లో స్థల సమస్య, సౌకర్యాల లేమితో సిబ్బంది, రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ఆ నాలుగు పీఏసీఎస్‌లకు నూతన భవనాలు నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

## చిన్నయ్యపాలెంలో ఘనంగా గౌరీ పరమేశ్వర ఉత్సవం

**గొలుగొండ. పతాకం న్యూస్:** గొలుగొండ మండలం చిన్నయ్యపాలెం గ్రామంలో సోమవారం శ్రీ గౌరీ పరమేశ్వర ఉత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి మహిళా భక్తులు స్వామివారు, అమ్మవార్లకు బిందెలతో సారె సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.ఈ వేడుకలతో గ్రామమంతా భక్తి భావంతో నిండిపోయి ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఉత్సవాలు శాంతియుతంగా, వైభవంగా కొనసాగాయి.

## బీబీ పట్నంలో అంగరంగ వైభవంగా గౌరీ పరమేశ్వరుల తీర్థ మహోత్సవం



**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బిబి పట్నం గ్రామ పెద్దలు సర్పంచ్ విశ్వేశ్వరావు ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ గౌరీ పరమేశ్వరుల తీర్థ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహిం చారు. ఈ సంక్రాంతి పండుగ పురస్కరించుకొని గ్రామంలో బంధుమిత్రులతో కలిసి గ్రామస్తులు, మహిళలు, యువతీ, యువకులు, భక్తులు గౌరీ పరమేశ్వరులకు మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎంతో ఆహ్లాదకరమైన పలు సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు కోలాటాలు, భజన బృందాలు, బుర్రకథ, నేల డ్యాన్సులు, తీన్మార్ డప్పులతో, డీజే స్టెప్పులతో స్వామివారిని సాగనంపారు. అనంతరం భక్తులకు గ్రామస్తులకు భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్దలు, గ్రామస్తులు, యువతీ, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# ఇష్టారాజ్యంగా పెట్రేగిపోతున్న ఇసుక మాఫియా?



**కర్నూలు, పతాకం న్యూస్:** జిల్లాలో తుంగభద్ర నదిలో ఇసుక తవ్వకాలు, రవాణా కోసం గనులు భూగర్భవనరులు, జలవనరులు, రెవెన్యూ శాఖ అధికారులు సర్వే చేసి సి.బెళగల్ మండలం కొత్తకోట, కె.సింగవరం, పల్లెదొడ్డి, ముడుమాల, ఈర్లదిన్నె గ్రామాల దగ్గర నాలుగు డీసిల్టేషన్ (నీటిలో బోటు ద్వారా ఇసుక తవ్వకాలు) ఐదు రీచ్‌లకు అనుమతులు ఇచ్చింది. కొత్తగా నందవరం మండలం నాగులదిన్నె, గంగవరం, వేదవతి నదిలో హొళగుంద మండలం ముద్దటమాగి ఇసుక రీచ్‌ల్లో 3.45లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక లభ్యత ఉందని అంచనా. ఉచిత ఇసుక పాలసీలో భాగంగా ఆన్‌లైన్ బుకింగ్ చేసుకున్న లబ్ధిదారులు తీసుకొచ్చే టిప్పర్లు, ట్రాక్టర్లకు రీచ్‌లో లోడింగ్ చేసే కాంట్రాక్ట్ టెండర్ల వివాదం న్యాయస్థానం పరిధిలో ఉంది. ఉచిత ఇసుక పాలసీ ని బంధనలు ప్రకారం జిల్లాలో అవసరమైన భవన నిర్మాణదారులకు ఇసుక సరఫరా చేయాలి. ఈ పాలసీ అక్రమార్కులు ఆదాయ వనరుగా మార్చుకున్నారు. నిబంధనలు తుంగలో కలిపేసి చీకటి దందాకు తెరతీశారు. నిఘా కళ్లక గంతలు కట్టి ఇష్టారాజ్యంగా జిల్లా సరిహద్దు తుంగభద్ర నది దాటించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ అక్రమ బాగోతంలో రెండు రాష్ట్రాలకు రాజకీయ నాయకులు, పోలీస్, మైనింగ్ అధికారులకు మామూళ్లు అందుతుండడంతో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. అప్పుడప్పుడు కంటితుడుపు దాడులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

తుంగభద్ర నది ఆవలి ఒడ్డున ఉన్న తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లాలో అలంపూర్, గద్వాల నియోజకవర్గాల్లో దాదాపు 8వేలు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయి. ఆ రాష్ట్రంలో ఇసుక రీచ్‌లు ఉన్నా.. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలకు మాత్రమే ఇసుక తరలింపు అనుమతులున్నాయి. ఇతర నిర్మాణాలకు ఇసుక తరలింపు అనుమతుల్లేవు. ఇందిరమ్మ ఇళ్లకు కూడా అవసరమైన మేరకు ఇసుక లభించడం లేదు. సరిహద్దు తెలంగాణ జిల్లాలో ఇసుక డిమాండ్‌ను మన మన జిల్లాకు చెందిన ఇసుక మాఫియా సొమ్ము చేసుకుంటోంది. రోజు పదుల సంఖ్యలో ఇసుక టిప్పర్లు సరిహద్దులు దాటుతున్నాయి. ఏపీ నుంచి నది అవలి ఒడ్డున ఉన్న ఉండవల్లి, అలంపూరు, మానవ-పాడు, ఇటిక్యాల, గద్వాల, అయిజ మండల్లాలోని వివిధ గ్రామాలతో పాటుగా హైదరాబాద్‌కు కూడా ఇసుక తరలిస్తున్నారు. దూరాన్ని బట్టి టిప్పరు ఇసుక రూ.25 వేల నుంచి రూ.65 వేలకు పైగా విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా జిల్లాలో ఇసుక బంగారమైంది. అవసరానికి నల్లబజారులో కొనుగోలు చేయాల్సి వస్తుంది. కర్నూలు నగరంలో 18-20 టన్నుల టిప్పరు ఇసుక రూ.10-12 వేలు, ఎమ్మిగనూరు పట్టణంలో రూ.11,500 నుంచి రూ.12,500లు, ఆదోని పట్టణంలో రూ.14-15 వేలకు పైగా విక్రయిస్తున్నారు.

# పండుగలు ముగియడంతో తిరుగుబాట పట్టిన ప్రజలు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** సంక్రాంతి కోసం స్వగ్రామాలకు వచ్చిన వలస జీవులు పండుగ ముగియడంతో మళ్లీ తిరుగుబాట పడుతున్నారు. బతుకుదెరువు కోసం బరువెక్కిన హృదయంతో సొంత ఊరిని వదిలి సుదూర ప్రాంతాలకు పయనమవుతున్నారు. ఉపాధి కోసం హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విశాఖపట్నం, విజయవాడ, సూరత్ వంటి ప్రాంతాలకు వేలాది మంది కూలీలతో పాటు అక్కడ పని చేస్తున్న ఉద్యోగులు, చదువుతున్న విద్యార్థులు తిరిగి వెళ్తున్నారు. దీంతో ఉదయం నుంచే శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్, ఆమదాలవలస రైల్వే స్టేషన్, పాలకొండ, టెక్కలి, పలాస తదితర ప్రాంతాల్లోని బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపినప్పటికీ అవి సరిపోలేదు. ఇదే అదనుగా కొన్ని ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థలు టిక్కెట్ల ధరలను పెంచేశాయి. రైళ్లలో జనరల్ కంపార్ట్‌మెంట్లు, రిజర్వేషన్ బోగీలు కిక్కిరిసిపోయాయి. ముఖ్యంగా విశాఖపట్నం, హైదరాబాద్ వైపు వెళ్లే బస్సులు, రైళ్లలో విపరీతమైన రద్దీ కనిపించింది. చేతిలో సంచులు, కళ్లలో ఊరు విడిచి వెళ్తున్నామన్న దిగులుతో ప్రయాణికులు బస్సుల కోసం పడిగాపులు కాస్తూ కనిపించారు. కాగా, సంక్రాంతి సందర్భంగా గత నాలుగు రోజుల పాటు వలస జీవులు, బంధుమిత్రుల పలకరింపులతో కళకళలాడిన పల్లెలు నేడు వారంతా పట్టణ, నగర బాట పట్టడంతో వెలవెలబోతున్నాయి.

# పశువైద్య శిబిరాలపై రైతులకు అవగాహన

**అనంతగిరి, పతాకంన్యూస్:** మూగజీవులకు సోకేవ్యాధుల పట్ల రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా ఈనెల 19 నుండి 31 తేదీ వరకు గ్రామాలలో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని పశు వైద్య శాఖ అధికారులు డాక్టర్ సాగరి గనేశ్వరరావు?, అనిల్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రం వద్ద స్థానిక సచివాలయ కేంద్రం లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. అనంతరం కాశీపట్నం పశు వైద్య శాఖ పరిధి లో సారవనిపాలెం, అనంతగిరి పశు వైద్య శాఖ పరిధి లక్ష్మీపురం గ్రామాలలో పశు వైద్య శిబిరాలు నిర్వహించి 64 పశువులు, 186 గొర్రెలు మేకలకు నిరోధిక టీకా ను వేయడం జరిగిందని డాక్టర్లు పేర్కొన్నారు. అంతేకాకుండా పంచాయతీ పరిధి గ్రామాల్లో దశలవారీగా పశువు సమర్థత శాఖ నిర్వహించే వైద్య శిబిరాలను రైతులు సద్వినియోగంపరుచుకోవాలని కోరారు. పశు భీమా నమోదు కార్యక్రమాలు ప్రతి ఒక్క రైతు నమోదు చేయించుకుంటే ప్రభుత్వం కల్పించే సదుపాయాలు రైతులకు అందే అవకాశాలు ఉంటాయని నమోదు కాని వారికి పశు బీమా పథకం వర్తింప జరగదని ఇప్పటికే తమ సిబ్బందితో గ్రామాలలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తప్పనిసరిగా ఈ అవకాశాలను రైతులు సద్వినియోగం పరచుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఎస్ .రూతు, ఎంపీటీసీ ఎం. సన్యాసిరావు, జిల్లా పశుసంవర్తక శాఖ అధికారి డాక్టర్ కరుణాకరావు, జిల్లా పశు సంవర్ధక శాఖ డాక్టర్ జయరాజ్, అరకు ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ శ్రీనుబాబు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్‌ను నియమించాలి



**అడ్డతీగల, పతాకం న్యూస్:** పోలవరం జిల్లా రంపచోడవరం డివిజన్ అడ్డతీగల మండల కేంద్రంలో ఉన్న సామజిక ఆరోగ్య కేంద్రంలో గైనకాలజిస్ట్ కొన్ని నెలలుగా అందుబాటులో లేరని అందువలన ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని తక్షణమే అందు బాటులోకి తీసుకుని వచ్చి ప్రజలను ఆదుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్(274/16) ఉమ్మడి అల్లూరి జిల్లా అధ్యక్షులు తీగల బాబురావు అన్నారు.

ఆసుపత్రిలో వైద్య సేవలు పొందుతున్న గర్భిణీ స్త్రీలను పర్యేక్షించటానికి గైనకాలజిస్ట్ లేకపోవటంతో బయట ప్రాంతాల్లో ఉన్న హాస్పిటల్స్ కి పంపిస్తున్నారని అందువలన తమకు చాలా ఇబ్బందులు వస్తున్నాయని బాధితుల బంధువుల్లో కొందరు తమ దృష్టికి తీసుకుని వచ్చారని ఆయన అన్నారు.ఈ విషయంపై అడ్డతీగల సామజిక ఆరోగ్య కేంద్రంలో నిరంతరం గైనకాలజిస్ట్ వైద్య సేవలు ప్రతి రోజు అవసరం అవుతాయని ప్రభుత్వ ఆసుపత్రికి ఎంతో మంది వస్తారని వారిలో కొంతమంది నిరుపేద కుటుంభికులు కూడా ఉంటారని అలాంటి వారికి ప్రైవేట్ గా వైద్య సేవలు చేయించుకోవటం సమస్యతో కూడుకున్న వ్యవహారమని తక్షణమే ఆసుపత్రిలో ఉండవలసిన అన్ని రకాల వైద్య సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచాలని రంప చోడవరం ఐటిడిఏ- పిఓ ద్వారా ఆసుపత్రి యాజమాన్యానికి, ప్రభుత్వానికి కోరామని తెలిపారు.

# శ్రీకాకుళం జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు 'పూర్వోదయం పథకం'తో భారీ నిధులు కేటాయింపు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** ఏళ్ల తరబడి సాగునీటి కోసం ఎదురుచూస్తున్న సిక్కోలు రైతాంగానికి శుభవార్త. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం పూర్వోదయం పథకం ద్వారా భారీగా నిధులను కేటాయించింది. రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల కోసం కేంద్రం రూ. 14,100 కోట్లు వెచ్చిస్తుండగా, అందులో ఉత్తరాంధ్ర జిల్లాలకు, ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లా ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు ప్రత్యేకంగా రూ.5వేల కోట్లు కేటాయించారు. ఈ నిధులతో జిల్లాలోని వంశధార, నాగావళి, మహేంద్రతనయ వంటి జీవనదుల ఆధారంగా చేపట్టిన ప్రాజెక్టులను వచ్చే రెండేళ్లలో పూర్తి చేసి, ప్రతి ఎకరానికీ నీరందించాలని ప్రభుత్వం సంకల్పించింది. సాగునీటి ప్రాజెక్టుల పెండింగ్ పనులపై ఇటీవల సీఎం చంద్రబాబునాయుడు ఢిల్లీ పర్యటనలో కేంద్రానికి ప్రత్యేక నివేదిక సమర్పించారు. వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలను అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సీఎం విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన కేంద్రం .. 'పూర్వోదయం'లో మన ప్రాజెక్టులను చేర్చింది. దీంతో జిల్లా దశ తిరగనుంది. జిల్లా రైతుల చిరకాల స్వప్నమైన 'మహేంద్రతనయ ఆఫ్ షోర్ రిజర్వాయర్' పనులకు ఈసారి భారీ ఊరట లభించింది. ఈ ప్రాజెక్టు కోసం ఏకంగా రూ. 506.68 కోట్లు కేటాయించారు. దీనిద్వారా కొత్తగా 24,600 ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా మెళియాపుట్టి, పాతపట్నం, టెక్కలి ప్రాంతాల్లో తాగునీటి సమస్య తీరనుంది. జిల్లాలోని రెండు ప్రధాన నదులైన వంశధార-నాగావళి అనుసంధానం ప్రక్రియకు నిధుల కొరత తీరనుంది. ఈ లింక్ కెనాల్ పనులకు రూ. 72.50 కోట్లు కేటాయించారు. ఇది పూర్తయితే 5 వేల ఎకరాల కొత్త ఆయకట్టుతో పాటు, మరో 18వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ జరుగుతుంది. గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువ, వంశధార రెండో దశ పనులకు రూ. 171.91 కోట్లు, హిరమండలం రిజర్వాయర్‌కు రూ.176.35 కోట్లు కేటాయించారు. తద్వారా వంశధార ఆయకట్టు రైతులకు భరోసా లభించింది. ఉత్తరాంధ్ర జిల్లాల వర ప్రదాయిని 'ఉత్తరాంధ్ర సుజల స్రవంతి'కి ఈ పథకంలో అత్యధిక ప్రాధాన్యం దక్కింది. దీనికి రూ.2,672.2 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో పనులు వేగవంతమైతే జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు గోదావరి జలాలు అందుతాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు రూ.1.30 లక్షల ఎకరాలకు కొత్తగా నీరందే అవకాశం ఉంది. జిల్లాలో మరో కీలక ప్రాజెక్టుయిన మడ్డువలస రిజర్వాయర్ రెండో దశ పనులకు రూ.30.04 కోట్లు, నాగావళి-చంపావతి అనుసంధానానికి రూ.21.53 కోట్లు కేటాయించారు. అలాగే తోటపల్లి బ్యారేజీ పనులకు రూ. 263.36 కోట్లు కేటాయించడం ద్వారా ఉమ్మడి జిల్లాలోని రాజాం, ఎచ్చెర్ల తదితర నియోజకవర్గాల ఆయకట్టుకు మేలు జరగనుంది.

# కుశర్లపూడి పురవీధుల్లో గౌరీపరమేశ్వరుల సారె ఊరేగింపు



**రోలుగుంట, పతాకం న్యూస్:** అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కుశర్లపూడిలో సాంప్రదాయ హైందవ ఉత్సవాల సందర్భంగా గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. సోమవారం సాయంత్రం ప్రారంభమైన ఈ కార్యక్రమం గ్రామ పురవీధులను దైవిక భక్తి వాతావరణంతో నింపింది. తలపై ఘటా లతో సారెలు ధరించిన మహిళలు శక్తి వేషాల్లో మార్గదర్శకులుగా మారి, తీన్మార్ డప్పులతో, మేళతాళాలతో,బాణాసంచాల మధ్య ఊరేగించారు. పురవీధుల్లో భక్తి రాగాలతో ఎంతో ఉత్సాహంగా సాగింది. బంధుమిత్రులతో కుటుంబ సమేత యువతి యువకులతో, పిల్లలు, వృద్ధులు సహా గ్రామ అశేష జనవాహిని ఈ దైవిక ఊరేగింపు ఆదర్శంగా నిలిచింది. అనంతరం నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. "ఈ ఉత్సవం మా హైందవ సంస్కృతి సాంప్రదాయాలు గ్రామ ప్రజల మధ్య ఉట్టిపడేలా మహిళల భాగస్వామ్యం అద్భుతం అని గ్రామ సర్పంచ్ మద్దు అప్పలనాయుడు తెలిపారు.ఈ సారె ఊరేగింపు గ్రామ సామరస్యాన్ని పెంచి, పురాతన సంప్రదాయాలను కొత్త తరానికి అందించే మైలురాయిగా నిలిచింది. అనంతరం గౌరీ పరమేశ్వరులను కోనేటి వద్ద సాగనంపడానికి వచ్చిన భక్తులకు సుమారు వెయ్యి మందికి భారీ అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దు అప్పలనాయుడు, వైస్ ఎంపీపీ కొల్లి సన్యాసినాయుడు, పెద్దింటి అమ్మ తల్లి ఉత్సవ కమిటీ చైర్మన్ కిల్లాడ అప్పల జ్యోతి నాయుడు, గొర్లి రమణ, ఎస్ పెద్ది నాయుడు, కేతిరెడ్డి సుధాకర్ నాయుడు,సబ్బవరపు కాశి, గొల్లు గోవింద, గొర్లి నారాయణరావు, పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# జీలుగు కల్లు ఘటనపై విచారణ



**కురుపాం, పతాకం న్యూస్:** వనకాబడి గ్రామంలో జీలుగు కల్లు తాగి పలువురు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఎక్సైజ్ సీఐ నాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ఆర్. చంద్రకాంత్, కురపాం ఎస్ఐ రాజశేఖరం గ్రామాన్ని సందర్శించారు. జీలుగు కల్లు ఘటనపై విచారించారు. కల్లు శాంపిల్స్ సేకరించారు. పరీక్షల నిమిత్తం విశాఖపట్నం లేబరేటరీకి పంపించారు. మిగిలిన జీలుగు కల్లును ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా వారు గ్రామస్థు లతో మాట్లాడారు. జీలుగు కల్లు సహజ సిద్ధంగా చెట్టు నుంచి లభించినప్పటికీ దానికి చట్టబద్ధమైన అనుమతుల లేవన్నారు. తాటి, ఈత కల్లు మాదిరిగా విక్రయించడానికి నిబం ధనలు లేవన్నారు. జీలు గు కల్లు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

# ప్రజా సమస్య పరిష్కార వేదిక వద్ద వ్యక్తి ఆత్మహత్యాయత్నం



**కురుపాం, పతాకం న్యూస్:** ఆస్తి విషయంలో అన్నదమ్ములు బెదిరిస్తున్నారని, ఎన్నిచోట్ల ఫిర్యాదులు చేసినా సమస్య పరిష్కారం కాలేదని ఆరోపిస్తూ బొబ్బిలికి చెందిన వ్యక్తి విజయనగరం కలెక్టరేట్ గ్రీవెన్స్‌లో ప్రజా సమస్య పరిష్కార వేదిక వద్ద పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన సోమవారం జరిగింది. విజయనగరం కలెక్టరేట్‌లోని బొబ్బిలికి చెందిన బి.వెంకట రమణ అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేయడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆపారు. వెనువెంటనే జిల్లా డిప్యూటీ కలెక్టర్ సేతు మాధవ్ దానిపై వివరణ ఇచ్చారు. ఆర్ఓ మురళి వచ్చి ఈరోజు సాయంత్రంలోపు సమస్య పరిష్కారం అయ్యే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ గత ఐదు సంవత్సరాలుగా ఎమ్మార్వో ఎండిఓ ఆర్డిఓ డిఆర్ఒ ఎస్పీ కార్యాలయం చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ పరిస్థితికి వచ్చానన్నారు. తన కుటుంబ సభ్యులైన అన్నదమ్ములు అమ్మే తనపై హత్యాయత్నానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించాడు.

# ఉపమాక వెంకన్న పెళ్లికి ఘనంగా పెండ్లిరాట ఉత్సవం



**నక్కపల్లి, పతాకం న్యూస్:** తిరుమల తిరుపతి దేవస్థాన ముల అనుబంధ దేవాలయమైన అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాక గ్రామంలో గరుడాద్రి పర్వతము పై స్వయం వ్యక్తం గా వేంచేసియున్న శ్రీ కల్కి వేంకటేశ్వర స్వామి వారి వార్షిక తిరు కళ్యాణ మహోత్సవములలో భాగంగా సోమవారం ఉదయం సాంప్రదాయబద్ధంగా నిర్వహించే పెండ్లి రాట ఉత్సవము ఘనంగా నిర్వహించారు. మాఘ శుద్ధ పాడ్యమి ఉత్తరాషాడ నక్షత్ర యుక్త మీన లగ్నముందు ముహూర్తాన్ని అనుసరించి ఉదయం 11 గంటలకు స్వామివారి ఆలయంలో పెండ్లిరాట ఉత్సవాన్ని దేవస్థానం అర్చక సిబ్బంది నిర్వహించారు. ఫిబ్రవరి 27వ తేదీ శుక్రవారం స్వామివారి వార్షిక కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందుగా ఈ పెండ్లి రాట ఉత్సవాన్ని నిర్వహించడం పూర్వం నుంచి వస్తున్న ఒక సాంప్రదాయమని ఆలయ ప్రధాన అర్చకుడు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు తెలిపారు. స్వామివారి ఆలయంలో జరిగే ఉత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## విగ్రహాల ఖర్చుతో మెడికల్ కాలేజీలు కట్టొచ్చు



**గుంటూరు, పతాకం న్యూస్:** రాజధాని ప్రాంతంలో నీరుకొండ వద్ద ఎన్‌టిఆర్ విగ్రహ నిర్మాణం కోసం రూ.1750 కోట్ల ప్రజాధనాన్ని వినియోగించే బదులు అదే డబ్బుతో ప్రజలకు ఉపయోగపడే ఏడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మించొచ్చని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ పేర్కొంది. పేదల కోసం నిరంతం పాటుపడిన ఎన్‌టిఆర్ స్ఫూర్తితో మెడికల్ కళాశాలలను ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తే బాగుంటుదని ప్రభుత్వానికి ఆ కమిటీ విజ్ఞప్తి చేసింది. ఈ అంశంపై కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు, కో-కన్వీనర్లు కె.ఎస్.లక్ష్మణరావు, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కొరివి వినరుకుమార్ గుంటూరులో మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వం రుషికొండపై రూ.500 కోట్లతో అతిపెద్ద ప్యాలెస్ నిర్మించిందని, ఈ నిధులతో రెండు మెడికల్ కళాశాలలను నిర్మించొచ్చన్న చంద్రబాబు ప్రస్తుతం రూ.1,750 కోట్లతో ఎన్‌టిఆర్ విగ్రహ నిర్మాణానికి ఎలా పూనుకున్నారని ప్రశ్నించారు. ఈ నిధులతో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఏడు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పూర్తి చేసి ఎన్‌టిఆర్ పేరు పెట్టొచ్చని సూచించారు. తమిళనాడులో ప్రభుత్వ నిధులతో కరుణానిధి విగ్రహాన్ని నిర్మించాలని ప్రయత్నిస్తే మద్రాసు హైకోర్టు, సుప్రీంకోర్టు సైతం తిరస్కరించాయని గుర్తుచేశారు. నేటి టిడిపి కూటమి ప్రభుత్వం గత 18 నెలల్లో రూ.మూడు లక్షల కోట్లకు పైగా అప్పులు చేసి ప్రతినెలా రూ.ఏడువేల కోట్లకు పైగా వడ్డీలు చెల్లిస్తున్న నేపథ్యంలో ప్రజాధనాన్ని ప్రజల కనీస అవసరాలైన విద్య, వైద్య రంగాలపై వెచ్చించాలని హితవు పలికారు. రూ.1750 కోట్లతో రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ క్లాస్ రూమ్‌లు, రక్షితనీరు, మరుగుదొడ్లు లాంటి సౌకర్యాలు కల్పించవచ్చని, ఎస్‌సి, ఎస్‌టి, బిసి హాస్టళ్లలో వసతులను మెరుగు పరచవచ్చనని వివరించారు. సమావేశంలో జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.ధనుంజయరెడ్డి, స్టూడెంట్స్ యూనియన్ ఫర్ నేషన్ నాయకులు కె.యశ్వంత్ పాల్గొన్నారు.

## తిరుమల శ్రీవారి ఆర్జిత సేవలు.. ఏప్రిల్ నెల కోటా బుకింగ్ షెడ్యూల్ వెల్లడి



**తిరుపతి, పతాకం న్యూస్:** తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారికి ఏప్రిల్‌లో నిర్వహించే ఆర్జిత సేవలు సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన సేవల్లో పాల్గొనేందుకు భక్తులు లక్కీడిప్ పద్ధతిలో టికెట్లు బుక్ చేసుకునేలా టీటీడీ ఈనెల 19న ఉదయం పది గంటలకు ఆన్‌లైన్‌లో కోటా విడుదల చేయనుంది. వీటిని 21న ఉదయం పది గంటల వరకు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. సేవలకు ఎంపికైన భక్తులు 21 మధ్యాహ్నం నుంచి 23 మధ్యాహ్నం 12 గంటల్లోపు ఆన్‌లైన్‌లో సొమ్ము చెల్లించాలి. ఈ-టికెట్లు పొందిన వారు జనవరి 21 నుంచి 23వ తేదీ వరకూ మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే దర్శన టికెట్లు మంజూరవుతాయి. అదే విధంగా జనవరి 22వ తేదీన ఉదయం 10 గంటలకు కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా, సాలకట్ల తెప్పోత్సవాలు, సాలకట్ల వసంతోత్సవాల టికెట్లను సైతం ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. జనవరి 23వ తేదీన ఉదయం 10 గంటలకు అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను కూడా విడుదల చేయనున్నారు. ఉదయం 11 గంటలకు శ్రీవాణి ట్రస్టు బ్రేక్ దర్శన టికెట్ల కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, దివ్యాంగులకు ఉచిత ప్రత్యేక ప్రవేశ దర్శన టోకెన్ల కోటానూ ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. ఇక జనవరి 24న ఉదయం 10 గంటలకు ప్రత్యేక ప్రవేశదర్శనం రూ. 300 టికెట్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తారు. అనంతరం అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకల్లా తిరుమల, తిరుపతిలో అద్దె గదుల బుకింగ్ కోటాను విడుదల చేస్తారు. రానున్న మార్చి నెలకు సంబంధించిన శ్రీవారి సేవ, పరకామణి సేవ కోటానూ ఈనెల 27వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. భక్తులు https:ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్‌లో మాత్రమే తమ టికెట్లను బుక్? చేసుకోవాలని టీటీడీ అధికారులు ఇప్పటికే సూచించారు.

## ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి



**ఛత్తీస్‌గడ్ :** ఛత్తీస్‌గడ్‌లోని బీజాపూర్‌లో రెండోరోజూ తుపాకులు గర్జించాయి. మరో ఇద్దరు మావోయిస్టులు ప్రాణాలు కోల్పోయారు. బీజాపూర్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టుల సంఖ్య ఆరుకు పెరిగింది. బీజాపూర్ జిల్లా ఎస్‌పి జితేంద్ర యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లాలోని నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు, పోలీసు బలగాలకు మధ్య ఎదురు కాల్పులు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ ప్రాంతంలో మావోయిస్టులున్నారన్న సమాచారంతో భద్రతా దళాల సంయుక్త బృందం తనిఖీలు ప్రారంభించినట్లు తెలిపారు. ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టులు దిలీప్? వెడ్జా, మాద్వి కోసా, లక్కీ మడ్కం, రాధా మెట్ట మరణించారు. మరో ఇద్దరు మావోయిస్టులు మరణించారు. వారిని గుర్తించాల్సి ఉందని ఎస్‌పి తెలిపారు. మృతదేహాల్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఘటనా స్థలం నుంచి ఎకె 47, 303 రైఫిల్, ఇన్సాస్, రైఫిల్‌తోపాటు భారీగా పేలుడు పదార్థాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# విశాఖలో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ కార్యాలయం




**విశాఖపట్నం, పతాకం న్యూస్:** ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశానికి "ది సిటీ ఆఫ్ డెస్టినీ"గా పిలుచుకునే విశాఖ నగరం ఒక ప్రత్యేక ఆకర్షణగా మారింది. రాబోయే కొన్ని సంవత్సరాలలో దీనిని విశ్వనగర కేంద్రంగా మార్చడానికి అనేక కొత్త ప్రాజెక్టులు రాబోతున్నాయి. దీంతో విశాఖ నగరం అనేక కార్యకలాపాలతో సందడిగా ఉంది. ఇటీవల, నగరంలో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి పచ్చజెండా ఊపారు. తాజాగా విశాఖలో కేంద్ర ప్రభుత్వం బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ కార్యాలయాన్ని ఏర్పాటు చేస్తోంది. విశాఖలో విమానాశ్రయం, పోర్టులు ఉండటంతో దేశవిదేశాల నుంచి ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు. ఎగుమతులు, దిగుమతులు గతంలో కన్నా చాలా బాగా పెరిగాయి. భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఇవి మరింత ఊపందుకోనున్నాయి. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయిలో ఇమిగ్రేషన్ సేవలకు విశాఖలో ప్రత్యేక కార్యాలయం అవసరం కానుంది. దీంతో కేంద్ర హోంశాఖ విశాఖ నగరం మారికవలస సమీపంలోని వీఎంఆర్‌డీఏకు చెందిన ఓజోన్ వ్యాలీ లేఅవుట్‌లో కార్యాలయాన్ని ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంది. ఇప్పటికే ఈ కార్యాలయానికి కావలసిన స్థలం కొనుగోలు ప్రక్రియ పూర్తయింది. కేంద్ర హోంశాఖ ఆధ్వర్యంలో బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్ (బీవోఐ) పనిచేస్తుంది. ఈ ప్రభుత్వ సంస్థని 1971లో స్థాపించారు. కేంద్ర హోం మంత్రి ఆధ్వర్యంలో ఈ సంస్థ పనిచేస్తుంది. దేశవ్యాప్తంగా సుమారు 108 ఇమిగ్రేషన్ కార్యాలయాలు ఉండగా వాటిలో 48 కార్యాలయాలను బీవోఐ నిర్వహిస్తుంది. మిగిలిన కార్యాలయాలు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యక్ష నియంత్రణలో ఉన్నాయి. వ్యవహారాలన్నీ బీవోఐ(బ్యూరో ఆఫ్ ఇమిగ్రేషన్) పరిధిలోకి వస్తాయి. విదేశాల నుంచి రాకపోకలు సాగించే ప్రయాణికుల వ్యవహారాలను బీవోఐ పరిశీలిస్తుంది. సిబ్బంది కొరతతో ప్రస్తుతం తనిఖీలు ప్రక్రియ సక్రమంగా జరగడం లేదు. ఒక్కోసారి బీవోఐ రాష్ట్ర పోలీసుల సహకారం కూడా తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర హోంశాఖ బీవోఐని మరింత బలోపేతం చేయాలని నిర్ణయించింది. ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్) కాంప్లెక్స్ ఇమిగ్రేషన్ తనిఖీల్లో ఎంతో కీలకం. త్వరలో దీన్ని కొనుగోలు చేసిన స్థలంలోనే నిర్మించనున్నారు. ఈ కాంప్లెక్స్ ఇమిగ్రేషన్‌కు ఒక చెక్‌పోస్టు లాంటిది. అందులో విదేశీయులకు సంబంధించిన దస్త్రాలను సాంకేతికంగా విశ్లేషిస్తారు. అవసరమైన సమాచారాన్నంతా భద్రప రుస్తారు. బీవోఐ అనేది హోం వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద పనిచేసే ఒక భారతీయ ప్రభుత్వ సంస్థ. ఇది దేశవ్యాప్తంగా సముద్ర ఓడరేవులు, విమానాశ్రయాలు, ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్ట్‌లలో ఇమిగ్రేషన్ విధులను నిర్వహిస్తుంది. దేశంలో ఉన్న ప్రధాన నగరాల్లో ఈ కార్యాలయం ఉంటుంది. న్యూదిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు, కలకత్తా, అమృత్ సర్, కొచ్చి, గోవా, లఖ్‌నవూ, తిరువనంతపురం, అహ్మదాబాద్ వంటి నగరాల్లో ఈ బీవోఐ ఉంది. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో దీనిని ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

**దేశ భద్రతలో బ్యూరో ఆఫ్ ఇమ్మిగ్రేషన్ కీలక విధులు** : వీసా, ప్రవేశ నియంత్రణ: భారతదేశంలోకి ప్రవేశించే విదేశీయుల వీసాల జారీ, ధృవీకరణ, వారి ప్రవేశాన్ని క్రమబద్ధీకరించడం బీవోఐది ప్రాథమిక బాధ్యత.

విదేశీయుల నమోదు: దీర్ఘకాలిక వీసాలపై (180 రోజులకు పైగా) వచ్చే విద్యార్థులు, ఉద్యోగులు, పరిశోధకులు తమ వివరాలను ఫారినర్స్ రీజినల్ రిజిస్ట్రేషన్ ఆఫీస్ (ఎఫ్‌ఆర్‌ఆర్‌ఓ) వద్ద నమోదు చేసుకోవడాన్ని ఇది పర్యవేక్షిస్తుంది.

అక్రమ వలసల నిరోధం: సరైన పత్రాలు లేకుండా దేశంలోకి ప్రవేశించే అక్రమ వలసదారులను గుర్తించడం, వారిని అదుపులోకి తీసుకోవడం, బహిష్కరణ ప్రక్రియలను వేగవంతం చేయడం ఈ విభాగం విధి.

ఇమ్మిగ్రేషన్ మోసాల విచారణ: 2025 కొత్త చట్టం ప్రకారం, నకిలీ పత్రాలు, వీసా మోసాలను విచారించే అధికారం బీవోఐకి ఉంది. అక్రమాలకు పాల్పడే సంస్థలపై చర్యలు తీసుకునే అధికారాన్ని కూడా ప్రభుత్వం కల్పించింది.


చెక్‌పోస్టుల నిర్వహణ: దేశవ్యాప్తంగా ఉన్న అంతర్జాతీయ విమానాశ్రయాలు, నౌకాశ్రయాలు, భూ సరిహద్దుల వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టులలో (ఐసీపీ) ప్రయాణికుల రాకపోకలను పర్యవేక్షిస్తుంది.

ప్రయాణికుల సమాచార సేకరణ: విమానయాన, షిప్పింగ్ కంపెనీల నుంచి ప్రయాణికుల వివరాలను ముందుగానే సేకరించి, అనుమానితులను గుర్తించడంతో పాటు భద్రతా తనిఖీలు నిర్వహించడం దీని పని.

ఫాస్ట్ ట్రాక్ ఇమ్మిగ్రేషన్ : భారతీయ పౌరులు, ఓసీఐ కార్డర్ల కోసం విమానాశ్రయాలలో వేగవంతమైన ఇమ్మిగ్రేషన్ క్లియరెన్స్ సేవలను ఈ విభాగం అందిస్తోంది.

రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం: దేశంలో ఉన్న విదేశీయుల కదలికలను పర్యవేక్షించడానికి, చట్టవిరుద్ధంగా ఉంటున్న వారిని గుర్తించడానికి రాష్ట్ర పోలీసు విభాగాలతో కలిసి పని చేస్తుంది.

# పీపీపీ దిశగా అమరావతి.. నిబంధనల రూపకల్పనపై కసరత్తు



**అమరావతి, పతాకం న్యూస్:** రాజధాని అమరావతి నగరం పిపిపి దిశగా అడుగులు వేస్తోంది. స్వయం ప్రతిపత్తి కల్పించే దిశగా నిబంధనలు రూపొందిస్తున్నారు. పరిపాలనకు వీలుగా రూపొందించే నిబంధనలు ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు నియమించిన సంస్థలు లేదా వ్యక్తుల అనుమతి, పర్యవేక్షణ తప్పనిసరి చేశారు. మరో నెలరోజుల్లో విధి విధానాలు ఖరారయ్యే అవకాశం ఉంది. రాజధాని ఆర్థిక అవసరాలు తీర్చుకునేందుకు భూములు అమ్ముకోవడానికి (మానిటైజ్) హక్కుల కల్పించే విధంగా మున్సిపల్? చట్టాల్లో మార్పులు చేయనున్నారు. దేశంలో తొలిసారి పూర్తిగా ప్రపంచబ్యాంకు కనుసన్నల్లో తయారవుతున్న చట్టాలుగా అమరావతి క్యాపిటల్?సిటీ పరిపాలన నిబంధనలు నిలవనున్నాయి. ముఖ్యంగా రాజధాని ఆర్థిక వనరులను అంచనా వేసి స్థిరమైన రాబడి, పిపిపి, ప్రైవేటు పెట్టుబడికి అవసరమైన విధంగా చట్టపరమైన ఫ్రేమ్?వర్కును రూపొందించనున్నారు. దీనికోసం ప్రస్తుతం ఉన్న ఎపిసిఆర్?డిఏ చట్టాలను పరిశీలించి 74వ రాజ్యాంగ సవరణకు లోబడి స్వయం ప్రతిపత్తి కల్పించేందుకు అవసరమైన అన్ని అంశాల్లో మార్పులు చేర్పులు చేయనున్నారు. నిబంధనల రూపకల్పన కోసం ఢిల్లీ, ఛండీగడ్, నయా రాయపూర్, డొలేరా కార్పొరేషన్లు, పరిపాలన సంస్థలతోపాటు అంతర్జాతీయంగా సింగపూర్, బ్రెసీలియా, పుత్రజయ, సెజోంగ్, నసుంతారా, జోహాన్స్‌బర్గ్, ఆస్తానా నగరాల్లో పాలనా నిబంధనలు పరిశీలించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న మున్సిపల్?, కార్పొరేషన్? చట్టాలకు మించి ప్రత్యేక చట్టాలు రూపొందించనున్నారు. పరిపాలన కోసం అత్యున్నత మండలిని ఏర్పాటు చేయడం, రవాణా, విపత్తు నిర్వహణ వంటి అంశాల కోసం ప్రత్యేక ఏజెన్సీలనూ నియమించేందుకు వీలుగా చట్టాలను రూపొందించాలని నిర్ణయించారు. ప్రస్తుతం ఉన్న సిఆర్?డిఏ చట్టం నుండి పరిపాలనా కేంద్రంగా మార్చేందుకు దశలవారీ ప్లాను రూపొందించనున్నారు. దీనికోసం రాజధానిలో కనీసం మూడు వర్కుషాపులు నిర్వహించి అభిప్రాయాలూ తీసుకోవాలని నిర్ణయించారు. ప్రస్తుతం రాజధాని నగరం నిర్మాణం జరుగుతున్న నేపథ్యంలో కొత్తగా రూపొందించే నిబంధనలు దశలవారీ జరిగే అభివృద్ధి, జనాభాకు వీలుగా మార్చుకునేలా ప్రతిపాదనలు చేయాలని అనుకున్నట్లు తెలిసింది. 2025 జులైలో ప్రపంచబ్యాంకు, ఆసియా డెవలప్?మెంట్? బ్యాంకు ఆధ్వర్యంలో ఇన్నోవేటివ్ అర్బన్ గవర్నెన్స్ అనే అంశంపై నిర్వహించిన సదస్సులో అమరావతికి ప్రత్యేక చట్టం కావాల్సిన అవసరాన్ని గుర్తించినట్లు పేర్కొన్నారు. ఈ సెమినార్లో ప్రభుత్వం నుండి అమరావతికి ఆర్థిక మద్దతు ఇవ్వడం, స్వయం ప్రతిపత్తి కల్పించడం, భూములను ఆర్థిక వనరులుగా మార్చుకోవడంపై దృష్టి సారించాలని సూచించారు. వీటిల్లో ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం, రాజధాని అమరావతి మధ్య ఆర్థిక పంపిణీ జరిగేలా చట్టాన్ని రూపొందించనున్నారు.

## మతతత్వానికి వ్యతిరేకంగా పోరాటం తీవ్రతరం

**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** దేశవ్యాప్తంగా మైనార్టీలు, దళితులు ఇతర అణగారిన ప్రజలపై దాడులు పెరిగిపోతున్నాయని భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధానకార్యదర్శి ఎంఎ బేబీ ఆందోళన వ్యక్తం చేశారు. హిందూత్వ మతతత్వ దాడులకు వ్యతిరేకంగా పోరాటాలను మరింత తీవ్రతరం చేస్తామని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రజాస్వామ్య వ్యవస్థను దెబ్బతీస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి, ఎన్నికల కమిషన్ జట్టుకట్టి కుట్రపూరితంగానే ఎస్ఐఆర్ అమల్జేస్తున్నట్లు విమర్శించారు. కేరళలోని తిరువనంతపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నకిలీ ఓటర్లను ఓటర్ల జాబితాలో చేర్చకుండా నిరోధించడానికి తమ పార్టీ అప్రమత్తంగా ఉంటుందని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్?ఐఆర్?) అనేది ఎన్నికల కమిషన్?తో బిజెపి, ఆర్?ఎస్?ఎస్? అమలుచేస్తున్న రాజకీయ ప్రణాళిక అని విమర్శించారు. ఎన్నికల కమిషన్? చేస్తున్న ప్రయత్నాలకు వ్యతిరేకంగా విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామని, అదే సమయంలో అర్హులైన ఏ ఒక్క ఓటరునూ ఓటరు జాబితా నుండి మినహాయించకుండా చూసుకుంటామని తెలిపారు. హిందూత్వ మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాటాన్ని కొనసాగించాలని, పార్టీ స్వతంత్ర బలం పెంచుకోవాలని కేంద్ర కమిటీ నిర్ణయించిందని అన్నారు. ముస్లిం, క్రైస్తవ మైనారిటీలపై దాడులు పెరుగుతున్నాయని, బిజెపి ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా అటువంటి దాడులను అనుమతిస్తున్నాయని విమర్శించారు. ఇవన్నీ లౌకిక రాజ్యాన్ని కూల్చివేసి హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి ఆర్?ఎస్?ఎస్? చేస్తున్న ప్రయత్నాల కొనసాగింపేనని పేర్కొన్నారు. జమ్మూకాశ్మీర్? రాష్ట్ర హోదాను, అక్కడి ప్రజల ప్రజాస్వామ్య హక్కులను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్? చేస్తూ కేంద్ర కమిటీ ఒక ప్రత్యేక తీర్మానాన్ని ఆమోదించిందన్నారు. వెనిజులా, పాలస్తీనా పట్ల భారతదేశ విదేశాంగ విధానం సిగ్గుచేటు అని విమర్శించారు. దేశ విదేశాంగ విధానాలు అమెరికా అహంకారం, వారి ఆధిపత్య ప్రయత్నాలకు అనుగుణంగా నిర్ణయించబడుతున్నాయని అన్నారు. దేశ వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి విషయంలో రాజీ పడుతోందని పేర్కొన్నారు.

# డైట్ నియమాలతో 'బరువు' తగ్గవచ్చు?

శారీరకంగా ఫిట్ ఉండాలన్నా, బరువు తగ్గాలన్నా వ్యాయామం తప్పక చేయాల్సిందే. అయితే, డైట్ పాటిస్తూ కూడా బరువును అదుపులో ఉంచుకునే అవకాశం ఉంది. అందుకే, వ్యాయామం కుదరని చాలా మంది డైట్? పాటిస్తున్నారు. బరువు పెరగకుండా మితంగా ఆహారాన్ని తీసుకోవడమే డైట్ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్, కీటో డైట్ అంటూ డైట్‌లో అనేక ట్రెండ్స్ వచ్చాయి. మరి, వేటితో ఎలాంటి లాభముందో ఇప్పుడు తెలుసుకుందాం!

ఈ డైట్‌లో ఆహారంపై కాకుండా టైంకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తారు. 16:8, 20:4 పద్ధతిని బాగా ఫాలో అవుతుంటారు. అంటే 16 గంటలు లేదా 20 గంటలు ఎలాంటి ఆహారం తీసుకోకుండా ఫాస్టింగ్ చేసి ఆ తర్వాత 8 గంటలు లేదా 4 గంటలు కడుపు నిండా లాగించేస్తుంటారు. ఆ తర్వాత మళ్లీ 16 లేదా 20 గంటలు ఉపవాసం ఉంటారు. ఈ పద్ధతిలో కేలరీల గురించి చింతించాల్సిన అవసరం లేదంటున్నారు నిపుణులు. ఏమైనా తినొచ్చని సూచిస్తున్నారు. ఆకలి, బరువును నియంత్రించడంలో ఈ డైట్ సహాయపడుతుంది. శరీర మెటబాలిజం మెరుగుపడుతుంది. అయితే, గర్భిణులు, వృద్ధులు, డయాబెటిస్ పేషెంట్స్‌కు ఈ డైట్ సరిపడదు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ బరువు తగ్గడానికి ప్రభావవంతంగా ఉంటుందని, 10 వారాలలో 7-11 పౌండ్ల బరువు తగ్గే అవకాశం ఉందని సర్వేలో తేలింది.

ఈ విధానంలో చాలా తక్కువ మొత్తంలో కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారాన్ని తీసుకుంటారు. మామూలుగా మన శరీరం కార్బోహైడ్రేట్ల ద్వారా శక్తిని పొందుతుంది. ఇక్కడ తక్కువ కార్బోహైడ్రేట్లు తీసుకోవడం వల్ల శరీరం, నిల్వగా ఉన్న కొవ్వును కరిగించి శక్తిగా మార్చుకుంటుంది. దీంతో శరీరంలో కొవ్వు కరిగి బరువు తగ్గుతారని నిపుణులు చెబుతున్నారు.




అలాగే, షుగర్ లెవల్స్ నియంత్రణలో ఉంటాయట. ఈ పద్ధతిలో బ్రెడ్, స్వీట్స్, బంగాళదుంపలు, బియ్యం, గోధుమలు ఇలా ఎక్కువ కార్బోహైడ్రేట్లు ఉన్న ఆహారం తీసుకోవద్దు. డ్రై ఫ్రూట్స్, పాలకూర, క్యాబేజీ, గుడ్లు, మాంసాహారం వంటివి తినొచ్చు.

మెడిటరేనియన్ డైట్ అనేది మధ్యధరా సముద్ర తీర దేశాలైన గ్రీస్, ఇటలీ, స్పెయిన్ తదితర దేశాల్లోని ప్రజల ఆహారపు అలవాట్లలో ఈ డైట్? ఒకటి. దీంట్లో తీపి పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్, డీప్?ఫ్రై వంటకాలు వంటివి తినకూడదు. తాజా పండ్లు, పచ్చి కూరగాయలు, చిరుధాన్యాలు, డ్రైఫ్రూట్స్, ఆలివ్‌నూనెతో చేసిన వంటలు మాత్రమే తినాల్సి ఉంటుంది. ఆరోగ్యకరమైన భోజనం చేయడమే మెడిటరేనియన్ డైట్ ప్లాన్. ఇది బరువు తగ్గడానికే కాదు, గుండె ఆరోగ్యానికి సహాయపడుతుందంటున్నారు నిపుణులు. ఈ ఆహారం తీసుకునే వ్యక్తులు కాలక్రమేణా తక్కువ బరువు పెరుగుతారని బషఝుఙఱం.వసబ అధ్యయనం పేర్కొంది. ఇది అధిక బరువు లేదా ఊబకాయం వచ్చే అవకాశాన్ని తగ్గిస్తుందని సూచిస్తుంది. ఈ డైట్ పాటించే వారు, పాలు, గుడ్లు, మాంసం ఇలా జంతు ఉత్పత్తులు తీసుకోవడం పూర్తిగా మానేసి కేవలం మొక్కల నుంచి వచ్చే ఆహారంపైనే ఆధారపడి ఉంటారు. తాజా పండ్లు, ఆకుకూరలు, పచ్చి కూరగాయలు, పప్పు ధాన్యాలు ఎక్కువగా తింటారు. ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉంటారు. తద్వారా సహజంగా బరువు తగ్గుతారు. మెదడు చురుగ్గా మారడంతో పాటు జ్ఞాపకశక్తి పెరుగుతుంది. అయితే, సరిపడా ఐరన్, ప్రొటీన్?, విటమిన్? బి12 శరీరానికి అందేలా చూసుకోవాలి. ఈ డైట్? ఖర్చు కూడా తక్కువగా ఉంటుంది. అంతేకాదు, పర్యావరణహితంగానూ ఉంటుంది.

ప్రస్తుతం బాగా పాపులరైన డైట్ ట్రెండ్ ఇది. భోజనానికి బదులుగా ప్రొటీన్, ఫైబర్? ఎక్కువగా ఉండే స్మూతీలను తీసుకుంటారు. పండ్లు, కూరగాయలు, ఓట్స్, విత్తనాలు, పప్పు వంటి పదార్థాలతో వీటిని తయారు చేస్తారు. భోజనం చేయడానికి కూడా సమయం లేని వ్యక్తులు ఈ స్మూతీలను ఎంపిక చేసుకుంటారు. ఈ డైట్ వల్ల పోషకాలు ఎక్కువగా అందడంతో పాటు తక్షణ శక్తి లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగవడంలో, బరువు తగ్గడంలో సహాయపడుతుంది.

స్థానికంగా లభించే, రసాయనాలు ఉపయోగించకుండా పండించే ఆహార పదార్థాలను తీసుకోవడమే ఈ డైట్? ప్రత్యేకత. ఆహారం తీసుకోవడంలో ఎలాంటి నిబంధనలు ఉండవు. కానీ, తాజాగా, పోషకాలు మెండుగా ఉండే ఆర్గానిక్ ఫుడ్‌ను మాత్రమే తీసుకోవాలి. ఆర్గానిక్ ఫుడ్‌కు కాస్త ఖర్చు ఎక్కువగా ఉంటుంది.

కొందరు కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలను ఉడకబెట్టడం వల్ల అందులోని పోషకాలు నశిస్తాయని అనుకుంటారు. అందుకే, పూర్తిగా పచ్చి కూరగాయలు, తాజా పండ్లు తింటారు. ప్రాసెస్డ్ ఫుడ్, 48 డిగ్రీల సెల్సియస్? కంటే ఎక్కువ వేడి చేసిన ఆహార పదార్థాలకు దూరంగా ఉంటారు. ఈ డైట్‌తో బరువు తగ్గడంతో పాటు జీర్ణక్రియ మెరుగవుతుంది. ఫలితంగా, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు దరిచేరవు.


ఇవేవీ వీలు కాకపోతే డిజిటల్ డైట్‌ను పాటిస్తున్నారు. ఎలాగంటే, మనం తినే ఆహారంలో ఎన్ని కేలరీలు ఉన్నాయి, ఎన్ని పోషకాలున్నాయనే విషయాన్నే ముందుగానే తెలుసుకుంటున్నారు. దీనికోసం ఆన్‌లైన్‌లో వెతుకుతున్నారు. ఇందుకు మొబైల్ యాప్స్, ఇతర పరికరాలూ అందుబాటులో ఉన్నాయి. మనం తినే ఆహారాన్ని స్కాన్ చేస్తే చాలు, వాటిలో కేలరీలు, పోషకాల విలువల గురించి వెల్లడిస్తాయి. దాన్ని బట్టి ఫుడ్ తీసుకోవడాన్ని నియంత్రించుకుంటున్నారు.

# చలికాలంలో జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే..



తాకాలంలో ఉండే చల్లగాలుల వల్ల కేవలం శరీరంలోనే కాదు, శిరోజాల్లో కూడా తేమ శాతం బాగా తగ్గిపోతుంది. ఫలితంగా, జుట్టంతా అట్టకట్టినట్లు పొడిగా మారిపోతుంది. అంతేకాకుండా, కుదుళ్లు బలహీనపడి జుట్టు రాలిపోయే సమస్య ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, చలి బారి నుంచి జుట్టును కూడా సంరక్షించుకుంటూ, కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు. మరి, అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం! కొంతమంది ఏ సీజన్‌లో అయినా రోజూ తలస్నానం చేస్తుంటారు. ఇంకొందరు, వారానికి మూడు లేదా నాలుగుసార్లు చేస్తూ ఉంటారు. ఈ క్రమంలో చలికాలంలో తలస్నానం మరీ ఎక్కువగా లేదా తక్కువగా కాకుండా వారానికి రెండుసార్లు చేస్తే సరిపోతుందంటున్నారు నిపుణులు. అలాగే, తలస్నానానికి ఉపయోగించే షాంపూ కూడా జుట్టుకు సరిపడినదటై ఉండాలి. వారంలో తలస్నానం ఎన్నిసార్లు చేయాలి అనేది జుట్టు రకం, ఆకృతిని బట్టి ఉంటుందని సర్వేలో తేలింది. తలస్నానానికి ముందు జుట్టుకు ప్రీవాష్ కండిషనర్స్ (కండిషనర్) తప్పకుండా అప్లై చేసుకోవాలి. ఇలా చేయడం వల్ల కుదుళ్లు దృఢంగా ఉంటాయి. అలాగే, షాంపూలో ఉండే రసాయనాల ప్రభావం కూడా జుట్టుపై అంతగా ఉండదు. చలికాలంలో వాతావరణం చల్లగా ఉండి, వేడినీటితో స్నానం చేయాలనిపించడం సర్వసాధారణం. అయితే, స్నానానికి బాగా వేడిగా ఉన్న నీళ్లను ఉపయోగించకూడదంటున్నారు నిపుణులు. గోరువెచ్చని నీటిని ఉపయోగించాలట. దీంతో కుదుళ్లు బాగా శుభ్రపడి రక్తప్రసరణ బాగా జరుగుతుందని, దీంతో జుట్టు రాలడం కూడా తగ్గుముఖం పడుతుంది. ఎక్కువ వేడిగా ఉన్న నీటిని ఉపయోగిస్తే చర్మం, జుట్టులోని సహజనూనెల శాతం తగ్గిపోయి పొడిగా, నిర్జీవంగా మారిపోతాయి. శిరోజాలకు సంబంధించి ఎక్కువ వేడిని ఉత్పత్తి చేసే వస్తువులు కూడా వాడకపోవడం ఉత్తమం. అంటే, తలను ఆరబెట్టుకోవడానికి డ్రయర్స్, బ్లోయర్స్, స్ట్రయిటనర్స్, కర్లర్స్ వంటి ఎలక్ట్రానిక్ వస్తువులను వాడకం కూడా వీలైనంత తగ్గించుకోవాలి. టవల్?తో తుడుచుకుని ఆరబెట్టుకునే విధానానికే ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వాలి. అలాగే, కండిషనర్ పెట్టుకున్న తర్వాత వేడి నీళ్లలో ముంచిన టవల్?ను తలకు చుట్టుకున్నా కుదుళ్లకు మంచి పోషణ అంది బలం చేకూరుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో హెయిర్ డ్రైయర్ లేకుండా జుట్టును ఆరబెట్టుకోవడం వల్ల జుట్టు ఉపరితలాలు బాగా రక్షించబడతాయని అధ్యయనం పేర్కొంది. ఈ కాలంలో శిరోజాలకు ఎంత తరచుగా నూనె పెడితే అంత మేలు. ఇది జుట్టులోని తేమ శాతం ఎక్కువ సమయం నిలిచి ఉండటానికి బాగా ఉపకరిస్తుందంటున్నారు నిపుణులు. అలాగే, తల దువ్వుకోవడానికి ఉపయోగించే దువ్వెన కూడా సరైనది ఎంపిక చేసుకోవాలి. పళ్లు కాస్త దూరంగా, వెడల్పుగా ఉన్నవటైతే మేలు.

# రష్యా నుంచి గ్రీన్‌లాండ్‌కు విముక్తి కల్పిస్తాం: వైట్‌హౌస్ ప్రకటన



**కారకాస్:** నాటో కూటమిలో చీలిక క్రమంగా పెరుగుతోంది. డెన్మార్క్ దేశంలోని గ్రీన్‌లాండ్ ద్వీపంపై అమెరికా వైట్‌హౌస్ సంచలన ప్రకటన విడుదల చేసింది. ఇక రష్యా ముప్పు నుంచి గ్రీన్‌లాండ్‌కు విముక్తిని కల్పిస్తామని వెల్లడించింది. రష్యా నుంచి గ్రీన్‌లాండ్‌కు ముప్పు ఉందని గత 20 ఏళ్లుగా నాటో కూటమి చెబుతున్నా డెన్మార్క్ పట్టించుకోలేదని ఆరోపించింది. గ్రీన్‌లాండ్ భద్రత కోసం ఇప్పటిదాకా డెన్మార్క్ ఏమీ చేయలేకపోయిందని వైట్‌హౌస్ పేర్కొంది. ఇక గ్రీన్‌లాండ్‌కు భద్రత కల్పించే సమయం వచ్చేసిందని, ఆ పనిని చేస్తామని స్పష్టం చేసింది. ఈమేరకు సందేశంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ట్వీట్ క్లిప్పింగ్‌తో వైట్‌హౌస్ సోమవారం ఉదయం ఈ ట్వీట్ చేసింది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో సోమవారం నుంచి జనవరి 23 వరకు జరగనున్న ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సందర్భంగా ట్రంప్‌తో నాటో సెక్రెటరీ జనరల్ మార్క్ ర్యూట్ భేటీ కానున్న వేళ వైట్‌హౌస్ ప్రకటన ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. డెన్మార్క్‌లోని గ్రీన్‌లాండ్ ద్వీపం తమ వ్యూహాత్మక ఆర్థిక, భద్రతా ప్రయోజనాలకు ముఖ్యమైందని, దాన్ని అమెరికా తీసుకుంటామంటే కుదరదని ఐరోపా దేశాలు వాదిస్తున్నాయి. గ్రీన్‌లాండ్ ముమ్మాటికీ డెన్మార్క్ దేశ భూభాగమే అని అవి తేల్చి చెబుతున్నాయి. ఈవిషయంలో మిత్రదేశం డెన్మార్క్‌కు అండగా నిలుస్తామని అంటున్నాయి. ఈమేరకు డెన్మార్క్, ఫిన్‌లాండ్, ఫ్రాన్స్, నెదర్లాండ్స్, నార్వే, స్వీడన్, యూకే, జర్మనీ ఇప్పటికే ఓ సంయుక్త ప్రకటనను విడుదల చేశాయి. ఇటీవలే గ్రీన్‌లాండ్‌లో డెన్మార్క్- ఐరోపా దేశాలు కలిసి నిర్వహించిన ఆర్కిటిక్ ఎండ్యూరన్స్ సంయుక్త సైనిక విన్యాసాలు ఏ దేశాన్నీ హెచ్చరించేందుకు కానే కాదని తేల్చి చెప్పాయి. కేవలం డెన్మార్క్, గ్రీన్‌లాండ్ ప్రజలకు పూర్తి సంఘీభావంగా నిలిచేందుకే ఆ విన్యాసాలు చేసినట్లు 8 ఐరోపా దేశాలు స్పష్టం చేశాయి. గ్రీన్‌లాండ్‌పై ఐరోపా దేశాల సంయుక్త ప్రకటన విని అగ్గి మీద గుగ్గిలమైన అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక ప్రకటన చేశారు. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకునేందుకు అంగీకారం తెలిపే వరకు ఆ 8 ఐరోపా దేశాలపై దిగుమతి సుంకాలను విధిస్తామని ట్రంప్ వెల్లడించారు.

# రైతులను వీడని యూరియా కష్టాలు

## లక్ష టన్నులకు చేరిన యూరియా కొరత!



**అమరావతి, పతాకం న్యూస్:** ఖరీఫ్‌లో రైతులకు కంటిపై నిద్ర లేకుండా చేసిన యూరియా కష్టాలు రబీని సైతం వీడలేదు. మొంథా తుపాన్ నష్టాల నుంచి తేరుకొని సాగుకు అన్నదాతలు ఉపక్రమిస్తున్న వేళ యూరియా కొరత ముందుకొచ్చింది. రబీ సీజన్‌లో జనవరి అత్యంత కీలకమైంది కాగా, ఈ నెలలో యూరియా అవసరాలకు, లభ్యతకు మధ్య భారీ గ్యాప్ కనిపిస్తోంది. రాష్ట్రం మొత్తమ్మీద వారం క్రితం దాదాపు 62 వేల టన్నుల కొరత ఉండగా సంక్రాంతి పండగ అనంతరం సాగు పనులు ముమ్మరమైన దరిమిలా గ్యాప్ లక్ష టన్నుల వరకు చేరుకుందని సమాచారం. అత్యధిక జిల్లాల్లో యూరియా నిల్వలు నిండుకున్నట్లు ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కావాల్సిన దాంట్లో సగం కూడా నిల్వలు లేవని క్షేత్ర స్థాయి నుంచి సమాచారం అందుతోంది. ఎరువుల కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైల్? డీలర్ల లాభాపేక్ష, ప్రభుత్వ ప్రణాళికాలోపరౌ రైతులకు యూరియా వెతలు తప్పట్లేదని విమర్శలస్తున్నాయి. యూరియా కోసం నెల్లూరు, ఎన్‌టిఆర్ జిల్లాల్లో ఇప్పటికే క్యూలైన్లలో రైతులు పడిగాపులు పడుతున్న దృశ్యాలు దర్శనమిస్తున్నాయి. పలు చోట్ల బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు అమ్ముతున్నట్లు రైతులు ఆవేదన చెందుతున్నారు. రాష్ట్రంలో యూరియాతో సహా అన్ని ఎరువులూ సమృద్ధిగా ఉన్నాయని ప్రభుత్వం చెబుతోంది. ఖరీఫ్‌లో కేంద్రం కోతలు విధించినా ఇదే పల్లవి వినిపించింది. తీరా డిమాండ్‌కు తగ్గట్లు యూరియా నిల్వలు లేక రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది. ఈ కోవలోనే సర్కార్ రబీ లెక్కలు వల్లిస్తోంది. గత సీజన్‌లో 9.38 లక్షల టన్నుల యూరియా అమ్ముడుపోగా, అంతే మొత్తంలో ఈ సారి కూడా కేటాయింపులు కాగితాల్లో కనిపిస్తున్నాయి. ఇప్పటికి 6.26 లక్షల టన్నులు కేంద్రం నుంచి రావాలి. జనవరి నాటికి ప్రారంభ నిల్వలతో లెక్కేసి 1.71 లక్షల టన్నులు అందుబాటులో ఉన్నాయంటోంది సర్కార్. జిల్లాల్లో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. ఈ నెల 7 నాటికి శ్రీకాకుళం, విజయనగరం, మన్యం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో కొరత భారీగా ఉంది. అవసరంలో సగం నిల్వలే అందుబాటులో ఉన్నాయి. ఏలూరు, ఎన్‌టిఆర్, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, అనంతపురం, శ్రీసత్యసాయి, కడప, చిత్తూరులో సైతం తక్కువ నిల్వలే నమోదయ్యాయి. ఇక అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కృష్ణా, పల్నాడు, అన్నమయ్య జిల్లాల్లో మాత్రం అవసరాలకు తగ్గట్టు యూరియా స్టాక్స్ ఉన్నాయన్నది వ్యవసాయశాఖ లెక్క. కేంద్రం నుంచి యూరియా సరఫరాలో కోతలు ఒక ఎత్తయితే అవసరాలకు తగినట్లు రాష్ట్ర ప్రభుత్వం వద్ద ప్రణాళిక, అప్రమత్తత లేకపోవడం మరొక ఎత్తుగా తెలుస్తోంది. ఉదాహరణకు నెల్లూరులో రబీ సమయంలో అత్యధికంగా వరి సాగవుతుంది. ఈ జిల్లాకు జనవరికి 30 వేల టన్నుల యూరియా అవసరమని అంచనా వేయగా ప్రస్తుతం 18 వేల టన్నులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మొంథా తుపాన్? వలన జనవరి రెండవ వారం వచ్చినా రాష్ట్రంలో 67 శాతం విస్తీర్ణంలోనే రబీ పంటలు సాగయ్యాయి. సాగు కావాల్సిన పంటల్లో వరి విస్తీర్ణం ఎక్కువ. సాగు నీటికి గ్యారంటీ ఉన్న కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లో సాగు ముమ్మరమవుతోంది. ఆయా జిల్లాల్లో ఇప్పటికే తగినంత యూరియా లేదు. రానున్న రోజుల్లో ఎద్దడి పెరిగే అవకాశాలున్నాయి. ఆర్?ఎస్?కెల వంటివి గ్రామ స్థాయి నుంచి పటిష్టమైన వ్యవస్థ ఉన్నా ప్లానింగ్?లో అసమర్థత నెలకొందని ఆరోపణలస్తున్నాయి. కంపెనీలు, డిస్ట్రిబ్యూటర్లు, రిటైలర్లు, కొంత మంది ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దల లాలూచీ కారణంగా అవసరాలకు తగ్గట్టు కాకుండా, వారి లాభాల కోసం యూరియా అక్రమంగా తరలుతోందని సమాచారం. కంపెనీల ఉత్పత్తులకు లింక్? పెట్టి ఎక్కడైతే వ్యాపారం జరుగుతోందో అక్కడికే యూరియా అధికంగా వెళుతోందన్న ఆరోపణలు రైతుల నుంచి వస్తున్నాయి.




## పోరాడి.. ఓడినా టీమిండియా

# వన్డే సిరీస్ న్యూజిలాండ్ కైవసం



భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1తో చేజిక్కించుకుంది. కివీస్‌కు భారతగడ్డపై ఇదే తొలి వన్డే సిరీస్ విజయం కావడం విశేషం. మూడో వన్డేలో కివీస్ గెలుపులో డారిల్ మిచెల్ (131 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 137), గ్లెన్ ఫిలిప్స్ (88 బంతుల్లో 9 ఫోర్లు, 3 సిక్సర్లతో 106) సెంచరీలతో కీలక పాత్ర పోషించారు. భారత్ భారీ ఛేదనలో విరాట్ కోహ్లీ (108 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 124) శతక పోరాటంతో చివరి వరకు నిలిచినా ఫలితం లేకపోయింది. దీంతో ఈ మ్యాచ్‌లో కివీస్? 41 రన్స్‌తో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్?కు దిగిన కివీస్ 50 ఓవర్లలో 8 వికెట్లకు 337 పరుగులు చేసింది. అర్ష్‌దీప్, హర్షిత్‌లకు మూడేసి వికెట్లు దక్కాయి. ఛేదనలో భారత్ 46 ఓవర్లలో 296 రన్స్‌కు ఆలౌటైంది. హర్షిత్ (52), నితీశ్ (53) అర్ధసెంచరీలతో రాణించారు. క్లార్క్, ఫౌక్స్‌లకు మూడేసి, లెనాక్స్‌కు 2 వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా మిచెల్ నిలిచాడు.

భారీ ఛేదనలో విరాట్ కోహ్లీ శతక పోరాటంతో ఆకట్టుకున్నాడు. ఓ ఎండ్‌లో వికెట్లు పడుతున్నా క్రీజులో పట్టు వదలకుండా నిలిచాడు. తనకు నితీశ్ నుంచి సహకారం లభించడంతో ఐదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యం లభించింది. చివర్లో హర్షిత్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఏడో వికెట్‌కు ఏకంగా 99 రన్స్ సమకూరడంతో విజయంపై ఆశలు చిగురించాయి. కానీ కివీస్ బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీసి మ్యాచ్‌ను వశం చేసుకున్నారు. ఓపెనర్ రోహిత్ (11) ఈసారీ విఫలం కాగా.. కెప్టెన్ గిల్ (23) జోరు కాసేపే అయ్యింది. వీరికి తోడు శ్రేయాస్ (3), రాహుల్ (1) ఇలా వచ్చి అలా వెళ్లడం దెబ్బతీసింది. ఈ స్థితిలో విరాట్-నితీశ్ కివీస్ బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నారు. నితీశ్ ఆరంభంలో ఆచితూచి ఆడాడు. ఆ తర్వాత పుంజుకుని వన్డేల్లో తొలి ఫిఫ్టీని కూడా పూర్తి చేసుకున్నాడు. అయితే కాసేపటికే అతడిని క్లార్క్ అవుట్ చేయడం, జడేజా (12) విఫలం కావడంతో కివీస్ పైచేయి సాధించింది. కానీ తొమ్మిదో నెంబర్ బ్యాటర్ హర్షిత్ ఎడాపెడా షాట్లు బాదాడు. అటు కోహ్లీ 91 బంతుల్లోనే కెరీర్‌లో 54వ సెంచరీ పూర్తి చేశాడు. 43వ ఓవర్‌లో హర్షిత్ 4,6 విరాట్ 6తో 21 రన్స్ సమకూరాయి. అయితే వరుస బంతుల్లో హర్షిత్, సిరాజ్ (0)ను ఫౌక్స్ అవుట్? చేయగా.. మరో ఓవర్ వ్యవధిలోనే విరాట్, కుల్దీప్ వెనుదిరిగారు. దీంతో మరో 24 బంతులుండగానే కివీస్ మ్యాచ్‌ను విజయంతో ముగించింది.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన కివీస్ ఇన్నింగ్స్‌లో మరోసారి డారిల్ మిచెల్ కీలకంగా నిలిచాడు. ఈసారి అతడికి ఫిలిప్స్ నుంచి సహకారం లభించింది. దాదాపు 31 ఓవర్లపాటు క్రీజులో ఆధిపత్యం ప్రదర్శించడమే కాకుండా ఇద్దరూ శతకాలతో చెలరేగారు. వీరి జోరుతో నాలుగో వికెట్‌కు ఏకంగా 219 పరుగుల భారీ భాగస్వామ్యం ఏర్పడడం విశేషం.

# రోహిత్‌శర్మ, కోహ్లీ

## మళ్లీ బరిలోకి దిగేదెప్పుడంటే..?



టీమిండియా వెటరన్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే టీ20, టెస్ట్ క్రికెట్ ఫార్మాట్లకు వీడ్కోలు పలికి కేవలం వన్డేల్లోనే కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఆదివారం న్యూజిలాండ్‌తో మూడు వన్డేల సిరీస్ ముగిసింది. ఈ సిరీస్‌ను న్యూజిలాండ్ 2-1 తేడాతో సొంతం చేసుకుంది. రోహిత్ శర్మ ఈ మూడు మ్యాచుల్లోనూ పెద్దగా రాణించలేదు. అయితే విరాట్ కోహ్లీ మాత్రం రెండు సెంచరీలతో చెలరేగాడు. భారత్ ఓటమి బాధ ఓవైపు అయితే రో-కో మళ్లీ ఎప్పుడు మైదానంలోకి దిగుతారో అనే బాధ అభిమానులను ఎక్కువగా వేధిస్తోంది. రో-కో మళ్లీ బరిలోకి ఎప్పుడు దిగనున్నారంటే.?

న్యూజిలాండ్ సిరీస్ ముగిసింది కాబట్టి రో-కోలకు దాదాపు ఆరు నెలల విరామం లభించనుంది. ఇప్పట్లో వన్డే సిరీస్ లేకపోవడంతో వీరికి రెస్ట్ దొరకనుంది. టీ20 ప్రపంచ కప్ 2026 సమీపిస్తుండటంతో భారత ఆటగాళ్లంతా దానిపై ఫోకస్ చేయనున్నారు. వరల్డ్ కప్?నకు ముందు న్యూజిలాండ్?తో టీమిండియా 5 టీ20ల సిరీస్ ఆడనుంది. టీ20 ప్రపంచకప్ ముగిసిన తర్వాత ఐపీఎల్ ప్రారంభం కానుంది. రోహిత్, విరాట్‌ను ఇక ఐపీఎల్‌లోనే మళ్లీ చూడాలి.

అంతర్జాతీయ మ్యాచుల విషయానికొస్తే.. రో-కో మళ్లీ జూన్ లేదా జులైలో బరిలోకి దిగుతారు. అప్పుడు అఫ్గానిస్థాన్ జట్టు భారత పర్యటనకు రానుంది. ఈ సిరీస్‌లో రో-కో ఆడే అవకాశాలున్నాయి. అయితే.. అఫ్గాన్‌తో వన్డే సిరీస్‌కు యువ ప్లేయర్లకు అవకాశం ఇస్తే వీరిద్దరూ ఆడకపోవచ్చు. ఆ తర్వాత టీమిండియా ఇంగ్లండ్ పర్యటనకు వెళ్లనుంది. అక్కడ మాత్రం రో-కో బరిలోకి దిగే అవకాశాలు ఎక్కువ. బ్లూ జెర్సీలో రో-కోను చూడటానికి అభిమానులు ఇంకా ఆర్నెళ్లు ఆగాల్సిందే.





## రూ.300 కోట్ల దిశగా పరుగులు పెడుతున్న
# ‘మన శంకరవరప్రసాద్ గారు’



మెగాస్టార్ చిరంజీవి అంటే కేవలం పేరు కాదు, బాక్సాఫీస్ వద్ద అదొక బ్రాండ్. ఆయన తాజా సినిమా ‘మన శంకర వరప్రసాద్ గారు’ థియేటర్లలో సృష్టిస్తున్న విధ్వంసం చూస్తుంటే అది మరోసారి రుజువైంది. ఈ సంక్రాంతికి విడుదలైన ఈ చిత్రం కాసుల వర్షం కురిపిస్తోంది. ఈ క్రమంలో తాజాగా చిరు మరో ఘనత సాధించారు. తన కుమారుడు రామ్‌చరణ్, సోదరుడు పవర్ స్టార్ పవన్ కల్యాణ్ కెరీర్ బెస్ట్ రికార్డులను చిరంజీవి ‘మన శంకర వరప్రసాద్ గారు’ సినిమాతో బ్రేక్ చేశారు. రామ్‌చరణ్ నటించిన గ్లోబల్ బ్లాక్ బస్టర్ ‘ఆరచవతీతీచరచవతీతీచర్’ రికార్డును చిరంజీవి క్రాస్ చేశారు. తెలుగు రాష్ట్రాల్లో కలెక్షన్ల పరంగా ఒక బెంచ్ మార్క్ సెట్ చేసింది. తాజాగా ‘ఎంఎస్‌జీ ఆ రికార్డును బ్రేక్ చేసింది. తెలుగు రాష్ట్రాల్లో 5వ రోజు ఆరచవతీతీచరచవతీతీచర్ రూ. 20.75 కోట్లు (గ్రాస్) వసూల్ చేయగా, అదే సమయంలో చిరు ‘ఎంఎస్‌జీ’ రూ. 20.75 కోట్లు (గ్రాస్) సాధించింది. అలా చెర్రీ కెరీర్‌లో ఆల్‌టైమ్ రికార్డ్‌ను చిరు బ్రేక్ చేశారు. ఇలా కొడుకు రికార్డును తండ్రి బ్రేక్ చేయడం మెగా అభిమానులకు డబుల్ కిక్ ఇస్తోంది. ఇక పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన ‘ఓజీ’ రికార్డు కూడా తుడిచిపెట్టుకుపోయింది. ప్రముఖ టికెట్ బుకింగ్ ప్లాట్‌ఫామ్ బుక్‌మైషోలో గతేడాది రిలీజైన ‘ఓజీ’ సినిమాకు మొత్తం 2.78 మిలియన్ల (27.8 లక్షలు) టికెట్లు సోల్డ్ అయ్యాయి. ఆ సినిమాకు లాంగ్ రన్‌లో జరిగిన మొత్తం టికెట్ల అమ్మకాలు ఇవి. కానీ చిరంజీవి ఈ రికార్డును కేవలం 6 రోజుల్లోనే బ్రేక్ చేశారు.

## 2027 మార్చి 5న
# థియేటర్స్‌లో ‘స్పిరిట్’



పాన్ ఇండియా సూపర్ స్టార్ ప్రభాస్ కొత్త మూవీ ‘స్పిరిట్’ విడుదల తేదీపై క్లారిటీ వచ్చేసింది. దీనిపై స్వయంగా మూవీ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగ సోషల్ మీడియా వేదికగా స్పష్టతను ఇచ్చారు. 2027 మార్చి 5న ప్రపంచవ్యాప్తంగా ‘స్పిరిట్’? సినిమా రిలీజ్ అవుతుందని ఆయన వెల్లడించారు. ఇంతకీ వచ్చే సంవత్సరం మార్చి నెలనే రిలీజ్ కోసం ఎందుకు ఎంచుకున్నారు ? అనే దానిపై ప్రభాస్ ఫ్యాన్స్, సినీ ప్రియుల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. అదేంటో ఇప్పుడు చూద్దాం. 2027 మార్చి నెల విషయానికొస్తే, 5వ తేదీన శుక్రవారం రోజున ‘స్పిరిట్’? విడుదల అవుతుంది. 6వ తేదీన (శనివారం) మహా శివరాత్రి పండుగ ఉంది. 7వ తేదీన ఆదివారం వస్తోంది. అంటే ఈ సినిమా రిలీజైన వెంటనే రెండు రోజుల పాటు వరుస సెలవులు వస్తున్నాయి. ఇది సినీ ప్రియులకు కలిసొచ్చే విషయం. ఈ మూవీ టీమ్ కోరుకుంటున్నది కూడా ఇదే. అతిపెద్ద సినీరంగ మార్కెట్ అయిన భారత్?లో తొలి మూడు రోజుల్లోనే వీలైనన్ని ఎక్కువ కలెక్షన్లను సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు కనిపిస్తుంది.

ఇక 2027 మార్చి 10న (బుధవారం) రంజాన్ పండుగ వస్తోంది. మార్చి 13, 14 తేదీల్లో (శని, ఆది) వీకెండ్ ఉంది. మార్చి 22న (సోమవారం) హోలీ పండుగ ఉంది. మార్చి 26న (శుక్రవారం) గుడ్ ఫ్రైడే ఉంది. మార్చి 27, 28 తేదీల్లో (శని, ఆది) వీకెండ్ ఉంది. మొత్తంగా చూస్తే, వచ్చే సంవత్సరం మార్చి నెలలో నాలుగు పండుగలు ఉన్నాయి. నాలుగు వీకెండ్?లు(శని, ఆది) ఉన్నాయి. ఇవన్నీ కలిపితే 12 రోజులు అవుతాయి. ఈ 12 రోజులు బాక్సాఫీస్ కలెక్షన్లకు కీలకంగా మారుతాయని స్పిరిట్ మూవీటీమ్ అంచనా వేస్తోంది.




# 100 కోట్ల క్లబ్‌లో ‘అనగనగా ఒక రాజు’



యంగ్ హీరో నవీన్ పోలిశెట్టి బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటారు. ఆయన కథానాయకుడిగా నటించిన ‘అనగనగా ఒక రాజు’ చిత్రం కేవలం ఐదు రోజుల్లోనే రూ. 100 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. సంక్రాంతి కానుకగా ఈ నెల 14న విడుదలైన ఈ సినిమా, కంటెంట్ ఉన్న చిత్రాలకు ప్రేక్షకులు ఎప్పుడూ బ్రహ్మరథం పడతారని మరోసారి రుజువు చేసింది. స్టార్‌డమ్ కంటే కథకే ప్రాధాన్యత ఇచ్చే నవీన్, ఈ చిత్రంతో తన మార్కెట్‌ను అగ్ర స్థాయికి తీసుకెళ్లారు.

తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లిన ఈ చిత్రం వసూళ్లలోనూ అదే జోరు చూపించింది. మొదటి రోజే రూ. 22 కోట్ల గ్రాస్ సాధించి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. కేవలం మూడు రోజుల్లో రూ. 61.1 కోట్లు రాబట్టిన ఈ సినిమా, ఐదు రోజులు పూర్తయ్యేసరికి రూ. 100.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్టు నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ అధికారికంగా ప్రకటించింది. పెద్ద సినిమాల పోటీ మధ్యలోనూ నవీన్ సినిమా ఈ స్థాయిలో వసూళ్లు సాధించడం విశేషం. క్లీన్ కామెడీ, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే భావోద్వేగాలతో దర్శకుడు మారి ఈ చిత్రాన్ని తెరకెక్కించిన తీరుపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా నవీన్ పోలిశెట్టి తనదైన కామెడీ టైమింగ్, డైలాగ్ డెలివరీతో సినిమాకు ప్రాణం పోశారని ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. ‘ఇదే అసలైన పండగ సినిమా’ అంటూ ఫ్యామిలీ ఆడియన్స్ థియేటర్ల నుంచి బయటకు వస్తుండటం ఈ సినిమా విజయానికి నిదర్శనంగా నిలుస్తోంది.

ఓవర్సీస్ లోనూ ‘రాజు’ గర్జన స్వదేశంలోనే కాకుండా ఓవర్సీస్ లోనూ ‘రాజు’ గర్జన కొనసాగుతోంది. ముఖ్యంగా యూ ఎస్ మార్కెట్‌లో ఈ చిత్రం 1 మిలియన్ డాలర్ల వసూళ్లను అధిగమించింది. దీంతో ‘జాతి రత్నాలు’, ‘మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి’ చిత్రాల తర్వాత వరుసగా మూడోసారి 1 మిలియన్ డాలర్ క్లబ్‌లో చేరిన సినిమాగా నిలిచింది. ఈ హ్యాట్రిక్ విజయంతో అమెరికాలో నవీన్ పోలిశెట్టి తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్కెట్‌ను సృష్టించుకున్నారు. కథ, పాత్రల బలాన్ని నమ్ముకుని సినిమాలు చేసే నవీన్, తన విజయపరంపరను కొనసాగిస్తున్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**